
శేషాచలంలో తొలిసారి పులుల గణన

డిసెంబరులో మొదలు

ఏర్పాట్లు చేసుకుంటున్న అటవీశాఖ



పులిరాజా.. నువ్వెక్కడ?

మంగళం, ఆంధ్రజ్యోతి

శేషాచలంలో పెద్దపులి కోసం తొలిసారి అన్వేషణ మొదలవుతోంది. దేశవ్యాప్తంగా అన్ని అడవుల్లోనూ డిసెంబరులో జరిగే పులుల గణన కార్యక్రమం శేషాచలం లోనూ ఈసారి జరగనుంది. నాలుగేళ్లకు ఒకసారి మాత్రమే పులుల సంఖ్యను లెక్కిస్తారు. నల్లమల అడవులను మాత్రమే ఆవాసంగా చేసుకున్న పెద్దపులి జాడ శేషాచలం సమీపంలో కొన్నేళ్లుగా కనిపించడమే ఇందుకు కారణం. 2017లో చామల రేంజ్ (నల్లమల అటవీప్రాంతం)లో ఒక మగపులి కనిపించింది. నాగార్జునసాగర్ రిజర్వ్ నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలోని నల్లమల, శేషాచలం కొండల మధ్య ఉన్న టైగర్‌కారిడార్‌లోకి పెద్దపులి ప్రవేశించిందని అప్పుడు గుర్తించారు. అలాగే ఈ ఏడాది ఆగస్టు నెలలో శేషాచల అడవులకు ఆనుకుని ఉన్న అన్నమయ్య జిల్లాలోని చిట్వేలి అడవుల్లోకూడా పెద్దపులి కనిపించింది. ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పగటిపూట, సాయంత్రం సమయాల్లో పులి తిరుగుతున్నట్టు రికార్డు అయింది. దాదాపు వందేళ్ల తరువాత ఈ ప్రాంతంలో పెద్దపులి కనిపించడం విశేషం. నల్లమల నుంచి వచ్చిన పెద్దపులులు శేషాచలంలో ఎన్ని ఉన్నాయో ఈ లెక్కింపు ప్రక్రియలో తేలనుంది.

300 ట్రాప్ కెమెరాలు

తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో పులుల గణన కోసం 300 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. రేంజ్ విస్తీర్ణం బట్టి 20 నుంచి 30 కెమెరాలు పెడుతారు.ఇక్కడ 15మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తారు. ట్రాప్ కెమెరాల ద్వారా పెద్దపులితో పాటూ ఇతర జంతువుల లెక్కింపు కూడా జరుగుతుంది.


పులులు ఎలా లెక్కిస్తారంటే..

ట్రాప్ కెమెరాలు — అడవిలోని వివిధప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. పులులు కదలిక కనిపించినపుడు కెమెరాలు గుర్తించి ఫోటోలు తీస్తాయి.

పాదముద్రలు — అడవుల్లో పులుల పాదముద్రల కోసం అన్వేషిస్తారు. వాటిని గుర్తించడం ద్వారా పులి పరిమాణం, ఆకారం , వయసు అంచనా వేస్తారు.

వెంట్రుకలు, గోళ్లు — పులులు తిరిగిన ప్రదేశాల్లోనూ, ఆవాసంగా చేసుకున్న తావుల్లోనూ వెంట్రుకలు, గోళ్ల సేకరిస్తారు. వీటిని డీఎన్‌ఏ పరీక్షలు కోసం పంపుతారు.ఈ నమూనాల ద్వారా పులుల సమగ్ర సమాచారం నిర్ధారిస్తారు.

భూభాగ విశ్లేషణ — పులులు నివసించే ప్రాంతాలను ముందుగా గుర్తిస్తారు. ఆ ప్రాంతాల్లోని ఇతర జంతువుల సంఖ్యను అంచనా వేస్తారు. పులికి ఆహారంగా ఉండే జంతువుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతానే పులి ఆవాసంగా ఎంచుకుంటుంది.



విజయనగర రాజ్య చిహ్నం వరాహం చిత్రంగల రాజముద్ర

శ్రీకాళహస్తిలో బయటపడ్డ అరుదైన విజయనగర కాలంనాటి రాగిపలకల శాసనాలు



రాగిరేకులమీద ఉన్న శాసనాలు

ముక్కంటికి బహుమానం

● పలు గ్రామాలు



పరశురామ్ గురుకుల్

శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

విజయనగరరాజు శ్రీరంగరాయ శ్రీకాళహస్తీశ్వరాలయంలో కైంకర్యాలు, అన్నదానాలు నిర్వహించడం కోసం నాడుకాడు, కంపిలి, అందలమాల, ఉప్పటేరు, దుగ్గరాజపట్టణం, పిలిగుంచలపోతు, చీమలపాడు, తిరుమూరు గ్రామాలను బహుమానంగా ఆలయానికి ఇస్తున్నట్లు లిఖించిన శాసనాలు బయటపడ్డాయి. ఆలయంలో అనువంశిక గురుకుల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పరశురామ్ ఇంట అవి పదిలంగా తరాలుగా ఉన్నాయి. శక. 1498, ధాత్రి, కార్తీక సు. 12న అనగా 1576 నవంబరు 3 శనివారం రోజున ఈగ్రామాలను దానంగా ఇచ్చినట్లు ఇందులో ఉంది. చంద్రగిరి రాజ్యంలోని పడనాడు సీమకు చెందిన బ్రాహ్మణుడు యాదాటి నరసింహభూపాల మనుమడు, తిమ్మావధాని కుమారుడు అయిన శ్రీలక్ష్మీపతి భట్టకు వీటిని దానంగా ఇచ్చినట్టు లిఖించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నైవేద్య కైంకర్యాలకు, పునరుద్ధరణ పనులకు వినియోగించాలని పేర్కొన్నారు. తిరుమూరుకు వెంగలాంబపురం అని పేరు మార్చిన అంశం కూడా ఇందులో ఉంది.

వెలుగులోకి వచ్చింది ఇలా...

శ్రీకాళహస్తీశ్వరాలయ రాజగోపురానికి ఆనుకుని ఉన్న తేరువీధిలో అనువంశిక దండాధికారి డాక్టర్ పరశురామ్ గురుకుల్ నివాసం ఉంది. వీరి వంశీయులు తరతరాలుగా పరంపరాగతంగా ఆలయంలో వైదిక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. తాత పేరుతోనే నామకరణం జరుపుకున్న పరశురామ్ గురుకుల్ చెన్నైలో ఎంబీబీఎస్ పూర్తి చేసి కొంతకాలం స్విమ్స్‌లో డాక్టర్‌గా చేశారు. చదువుతోపాటు వేదం, ఆగమ, శిల్ప శాస్త్రాలను అధ్యయనం చేశారు. వైద్యవృత్తికన్నా అనువంశికంగా చేస్తున్న వైదిక క్రతువుల నిర్వహణనే ఎంచుకున్న ఆయన ప్రస్తుతం ఆలయంలో దండాధికారిగా ఉన్నారు. తీరిక వేళల్లో ఇంటి వద్ద వైద్యసేవలు కొనసాగిస్తున్నారు. తమ ఇంట మంత్రబంధనంగాఉన్న పురాతన రాగిఫలకలను అపడుడపుడు తెరచేవారు. ఇటీవల కార్తీక మాసం కావడంతో వీటిని శుద్ధి చేశారు. డాక్టర్‌పరశురామ్ గురుకుల కుటుంబానికి పురోహితులుగా వ్యవహరిస్తున్న సింగరాజు మణి ఆ రాగిఫలకల మీద ఉన్న అక్షరాలను చూసి ఆసక్తితో వాటిని ఫోటోలు తీసి ఎపిగ్రఫీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి పంపడంతో ఇవి విలువైన చారిత్రక ఆధారాలనే సంగతి వెల్లడైంది. రెండు జతల శాసనాలు వీరి వద్ద ఉన్నాయి. ఇవి రాజముద్రతో కూర్చి ఉన్నాయి. రెండింటిలో కలిపి మొత్తం ఐదు రాగిపలకలు ఒక గుత్తిగా ఉన్నాయి.. ఇందులో ఒకదానిపై శ్రీరామ శాసనం...మరొకదానిపై విరూపాక్ష శాసనం అని ఉంది.

మీ సొమ్ము మీకే

● బ్యాంకులో మురుగుతున్న రూ.86.31కోట్లు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాలో నగదు వేసి లావాదేవీలు జరపకుండా వదిలేయడం.. ఖాతాదారులు మృతిచెందడం.. చిరునామా మార్చుకున్న వంటి కారణాలతో జిల్లాలో రూ.86.31కోట్లు బ్యాంకు ఖాతాల్లో మురుగుతున్నాయి. 5,14,468 ఖాతాల్లో రూ.86.31కోట్లు క్లెయిం చేయని నగదు ఉంది. వీటిలో వ్యక్తిగత ఖాతాల్లో రూ.60.20కోట్లు, వివిధ సంస్థలకు చెందవిన 30,400 ఖాతాల్లో రూ.20.83కోట్లు, ఇక ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 5,764 ఖాతాల్లో రూ.5.28కోట్లు ఉన్నట్లు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరు రవికుమార్ తెలిపారు. పదేళ్లపైగా లావాదేవీల్లేని ఖాతాలోని సొమ్మును ఇచ్చే ప్రక్రియను ఆర్‌బీఐ ప్రారంభించింది. కాబట్టి ఖాతాదారులు లేదా వారి నామినీలు సంబంధిత బ్యాంకుఖాతాను సంప్రదించి సరైన ధ్రువపత్రాలు సమర్పించి, ఈకేవైసీ పూర్తిచేయడం ద్వారా ఆ నగదు తిరిగి పొందవచ్చని లీడ్ బ్యాంకు మేనేజరు తెలిపారు.

వేడుకగా గృహ ప్రవేశాలు

● నిర్మాణం పూర్తయిన 14,486 పక్కా ఇళ్లు



పుత్తూరులో లబ్ధిదారులకు తాళం చెవి అందిస్తున్న ఎమ్మెల్యే భాను

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రభుత్వ పక్కా ఇళ్ళకు బుధవారం ఘనంగా గృహ ప్రవేశాలు జరిగాయి. ఎనిమిది నియోజవర్గాల పరిధిలో గతేడాది జూన్ నుంచీ ఇప్పటి దాకా పీఎంఏవై 1.0 పథకం కింద బీఎల్‌సీ, గ్రామీణ్ కేటగిరీలలో 14,486 పక్కా ఇళ్ళ నిర్మాణం పూర్తయ్యాయి. వీటిలో లే అవుట్లకు సంబంధించి 9984 ఇళ్లుండగా లబ్ధిదారుల సొంత స్థలాల్లో 4502 ఇళ్లున్నాయి. పూర్తయిన ఇళ్ళకు జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా చంద్రగిరిలో 1020, గూడూరులో 1564, నగరిలో 469, సత్యవేడులో 781, శ్రీకాళహస్తిలో 2232, సూళ్ళూరుపేటలో 1487, తిరుపతిలో 6047, వెంకటగిరిలో 886 చొప్పున ఇళ్ల నిర్మాణం పూర్తయింది. బుధవారం జరిగిన గృహ ప్రవేశ కార్యక్రమాల్లో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, పుత్తూరులో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, సత్యవేడులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణరెడ్డి, సూళ్ళూరుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేశారు. ఆయా చోట్ల స్థానిక హౌసింగ్ అధికారులు, ఉద్యోగులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చంద్రగిరికి సంబంధించి ఎమ్మెల్యే పులివర్తి నానీ అందుబాటులో లేకపోవడంతో ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2.20కోట్లు

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.2,20,13,724 వచ్చింది. ఆలయంలోని కొట్టు మండపం వద్ద లెక్కింపు చేపట్టారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను లెక్కించారు. బంగారం 59.100 గ్రాములు, వెండి 599 కిలోలు, విదేశీ కరెన్సీ 132 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది



పుత్తూరులో వైసీపీ శ్రేణుల ర్యాలీ

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు

● వైసీపీ శ్రేణుల ఆందోళన

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించవద్దంటూ బుధవారం జిల్లావ్యాప్తంగా వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. తిరుపతిలో భూమన అభినయ్, వెంకటగిరిలో నేదురుమల్లి రాంకుమార్, గూడూరులో ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్, సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్య, సత్యవేడులో రాజేశ్, శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నేతలు, శ్రేణులు ర్యాలీగా వెళ్లి ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో వినతపత్రాలిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుచానూరులో ర్యాలీగా వెళ్లి పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. ఇక, పుత్తూరులో మాజీ మంత్రి రోజా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ వర్గాలు ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు.

● ఆంధ్రజ్యోతి పరిశీలన



చిల్లకూరు ఒకటో సచివాలయంలో పనులకోసం వచ్చిన గ్రామస్తులు

● సచివాలయాల్లో పెద్దగా కనిపించని ఉద్యోగులు

● సర్వేలు, ఫీల్డువర్కు పేరిట ఎక్కువ సమయం బయటే

రీ గ్రూపింగ్‌తో గందరగోళం

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రీ గ్రూపింగ్‌తో సచివాలయ నిర్వహణ కొంత గందరగోళంగా మారింది. రీ గ్రూపింగ్‌తో క్లస్టర్ వ్యవస్థ ఏర్పాటు కావడంతో సిబ్బందిని ఆ క్లస్టర్ పరిధిలోని సచివాలయాల్లో సర్దుబాటు చేశారు. దీంతో కొందరు రెండు సచివాలయాల్లో పనిచేయాల్సి ఉంది. మరికొందరు డెప్యుటేషన్ తరహాలో మరో సచివాలయంలోనూ పని చేస్తున్నారు. వీఆర్వో, సర్వేయరు సచివాలయాల్లోనూ, తహసీల్దారు కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉండాలి. క్షేత్రస్థాయి విధులకూ హాజరు కావాలి. దీంతో వీరు ప్రజలకు అందుబాటులోకి రావడం కష్టంగా మారింది. పంచాయతీ, అడ్మిన్ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే సచివాలయాల్లో అందుబాటులో ఉంటుండగా మిగిలిన వారు ఫీల్డు వర్కు పేరిట అధిక సమయం బయటే ఉంటున్నారు.



రెండు రోజుల కిందట బాలాయపల్లి మండలం పిగిలాం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే

కొందరిపైనే పని ఒత్తిడి

- పంచాయతీ లేదా అడ్మిన్ కార్యదర్శి, డిజిటల్.. ఎనర్జీ.. వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం వంటి సిబ్బందికి పని ఒత్తిడి అధికంగా ఉంది.
- వీఆర్వో, సర్వేయర్లలో సిన్సియర్‌గా పనిచేసే వారిపై ఒత్తిడితో ఉండగా,మిగిలిన వారు అక్కడున్నాం..ఇక్కడున్నామంటూ కాలం గడిపేస్తున్నారు.
- అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీస్, వెటర్నరీ అసిస్టెంట్లకు ఆయా సీజన్లలో ఇ-క్రాప్ నమోదు, ఎరువులు-విత్తనాల పంపిణీ వంటి పనులున్నాయి. ఆ తర్వాత పని తక్కువే.
- హౌసింగ్ స్కీమ్‌లు ప్రారంభం కాకపోవడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పెద్దగా పని లేదు.
- మహిళా కార్యదర్శికి పని ఉండడం లేదనే చెప్పాలి. వీరిపై కొత్త విధానంలో తగిన పర్యవేక్షణ లేదు.

సచివాలయాలు ఎలా ఉన్నాయంటే..

జిల్లాలోని కొన్ని సచివాలయాలను సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు పరిశీలించారు.

- దక్కిలి మండలం పలుగోడు సచివాలయంలో డిజిటల్.. అగ్రికల్చర్ అసిస్టెంట్ మినహా మిగిలిన కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి.
- దక్కిలి మండలం చాపలపల్లి సచివాలయం ఉదయం 10.20 గంటలకు కూడా తాళాలు తీయలేదు.
- వెంకటగిరి పట్టణం 14, 15 వార్డులకు సంబంధించిన సచివాలయానికి 10.23 గంటలకు కూడా తాళాలు తీయలేదు. అర్జీదారులు తలుపు ముంగిట మెట్లపై నిరీక్షిస్తూ ఉన్నారు. ● బాలాయపల్లి మండలం పిగిలాం సచివాలయంలో కొందరు సెలవులో, ఇంకొందరు ఫీల్డుకు వెళ్లగా డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే కనిపించారు.
- చిల్లకూరులోని ఒకటో సచివాలయంలో సిబ్బంది అందరూ హాజరుకాగా అర్జీదారులతో కార్యాలయం సందడిగా కనిపించింది.



రిజిస్టర్లలో వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

'కోగిలి' సమస్యలు తీర్చేదెవరు?

చిట్టమూరు మండలం కోగిలి మేజర్ పంచాయతీ ప్రజల సమస్యలు తీర్చేందుకు ఏర్పాటు చేసిన సచివాలయమే సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఊరికి కిలోమీటరు దూరంలో చెరువు కలుజు వద్ద దీని భవనం నిర్మించారు. గ్రామస్తులు వ్యతిరేకించినా అప్పటి అధికార పార్టీ అయిన వైసీపీ నేతలు ఖాతరు చేయలేదు. భవనం కట్టి ఆరేళ్లయినా విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా లేదు. విద్యుత్ సర్వీసు లేనందున ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. కంప్యూటర్లకు బదులు రిజిస్టర్లలో వివరాలు నమోదు చేస్తున్నారు. ఆన్‌లైన్ సేవల్లేక గ్రామస్తులూ ఇబ్బంది పడుతున్నారు.

సచివాలయ వ్యవస్థ

పంచాయతీలు: 774

సచివాలయాలు: 691 (వార్డు 196, గ్రామ సచివాలయాలు 495), **సిబ్బంది:** 5303 (వార్డు 1743, గ్రామ సచివాలయాల్లో 3560)

రీగ్రూపింగ్ తర్వాత

సచివాలయాలు: 353 క్లస్టర్లు,

మిగులు సిబ్బంది: 775 (వార్డు 297, గ్రామ సచివాలయాల్లో 478)

● మొదట్లో సచివాలయానికి 12 మంది చొప్పున సిబ్బంది ఉండగా రీ గ్రూపింగ్ తర్వాత ఆ సంఖ్యను కనిష్ఠంగా 6 నుంచి గరిష్ఠంగా 8కి కుదించారు.

పరిశ్రమల అభివృద్ధికి సహకరించండి



చినబాబును సన్మానిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

రామచంద్రాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరి శ్రమల అభివృద్ధికి సహకరించాలని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి డైరెక్టర్‌గా నియమితులైన మురళీమోహన్(చినబాబు)ను జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరారు. బుధవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.వి.చౌదరి, కార్యదర్శి రఘురాంరెడ్డి, నగరాధ్యక్షులు మోహన్‌రాజు, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వైసీపీ నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు

తిరుచానూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నేతలు తిరుచానూరులో ర్యాలీ నిర్వహించారు. ఘంటసాల విగ్రహం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు జరిగిన ఈ ర్యాలీని ఉద్దేశించి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడం సరికాదన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మణికి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీలు నరేష్‌రెడ్డి, యోగానందరెడ్డి, శేఖర్‌రెడ్డి, వార్డు మెంబర్లు మునేంద్ర రాయల్, చంద్రశేఖర్, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

రుద్రకోటికి కంచి పీఠాధిపతి ఆశీర్వాదం



విజయేంద్ర సరస్వతి ఆశీర్వాదం తీసుకుంటున్న సదాశివం

తిరుపతి(జీవకోన), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకనగర్‌లోని పాదుక మండపంలో బుధవారం కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని ఏపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సీఆర్‌కే శేషగిరిరావు, నాదస్వర నిర్వాహకులు సత్యనారాయణ ఆయన వెంట ఉన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో ఇళ్ల ప్రారంభం



ఎన్టీఆర్ కాలనీలో ఇంటిని ప్రారంభిస్తున్న సుధారెడ్డి

చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మంజూరైన రెండు ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి బుధవారం ప్రారంభించారు. పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో రూ.12కోట్లతో ఎమ్మెల్యే పులివర్తి నాని ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. అనంతరం కాలనీలోని ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తక్షణం వీధి లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్నచిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పేరుతో మోసం



చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోర్నకంబాలలో నలుగురు వ్యక్తులు సన్నబియ్యం పేరుతో గ్రామస్తులను మోసం చేశారు. బాధితుల వివరాల మేరకు .. నలుగురు వ్యక్తులు ఓ ఆటోలో వచ్చి సన్నబియ్యం కేజీ రూ.40కే ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన విశ్వనాథంకు బియ్యం బస్తా చూపించారు. పైన బియ్యం బాగానే ఉండటంతో ఆయన రూ.10 వేలకు కొనుగోలు చేశారు. వాళ్ల వెళ్లిపోయాక చూస్తే పైన సన్నబియ్యం, లోపలంతా రేషన్ బియ్యం ఉండటంతో అవాక్కయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వందేమాతరం ఉత్సవాలు



పాలిటెక్నిక్‌లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగరాల ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం వందేమాతరం ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందరూ కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. చంద్రగిరి పాలిటెక్నిక్, తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్నల్ కడియాల శ్రీనివాసులు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.భక్తవత్సలం, సీటీవోలు మోహన్‌కృష్ణ, ఉదయ్‌కుమార్, ఎన్‌సీసీ స్టాఫ్ బావాజీ, శ్రీధర్, లోకేష్ పాల్గొన్నారు.

16న కార్తీక వన భోజనం

చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలో టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్య కల్యాణోత్సవం రద్దు చేశారు. కార్తీక మాసంలో ఇక్కడ వనభోజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి 9 గంటలకు శ్రీవారిమెట్టు వద్దగల పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత అలంకారం, ఉచితంగా వనభోజనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి సాయంత్రం 4 గంటలకు తిరిగి ఆలయానికి ఉత్సవమూర్తులు చేరుకుంటారు.

చంద్రగిరి

రోడ్లు వేశారు.. కాలువలు మరిచారు



పాలినేనిపల్లెలో మురుగునీటి కాలువ లేని వీధి

పాకాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సిమెంటు రోడ్లు వేశారు. మురుగునీటి కాలువల నిర్మాణం చేయలేదు. ఇరంగారిపల్లె పంచాయతీ పాలినేనివారిపల్లెలో అన్ని వీధులకు సిమెంటు రోడ్లు వేశారు. మురుగునీటి కాలువలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

సమ్మెటివ్ పరీక్షలు సక్రమంగా జరిపించాలి



పరీక్షలను పరిశీలిస్తున్న జిల్లా సమగ్ర శిక్ష ఏఎస్‌వో సారథి

పాకాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమ్మెటివ్ 1 పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏఎస్‌వో సారథి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షలను బుధవారం ఆయన పరిశీలించారు. పరీక్షల పేపర్లు ప్రభుత్వమే సరఫరా చేస్తుందని, ఆయా రోజు వాటిని తీసుకుని రాయించాలని అన్నారు. పరీక్షల అనంతరం పేపర్లుదిద్ది ఫలితాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎంఈవో 2 భాస్కర్ బాబు, పాకాల ఎంఈవో 2 లింగయ్య, హెచ్ఎం మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో పోలీసుల తనిఖీలు



ఆర్టీసీ బస్టాండులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పాకాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో పేలుడు నేపథ్యంలో బుధవారం పాకాల ఆర్టీసీ బస్టాండులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ సుదర్శనప్రసాద్ ఆధ్వర్యంలో బస్టాండు, రైల్వే స్టేషన్ పరిసరాలలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వివరాలను సేకరించారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి బీసీ కాలనీలో సోమవారం జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసి బుధవారం రిమాండు నిమిత్తం పాకాల కోర్టుకు తరలించినట్లు కల్లూరు సీఐ జయరామయ్య, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఎల్లంకివారిపల్లి బీసీ కాలనీలో కాపురముంటున్న వృద్ధురాలు కళావతమ్మ ఇంట్లోకి సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి చొరబడి మెడలోని బంగారు గొలుసు లాగుతుండగా మిద్దెపై కాపురం ఉంటున్న విమల (59) కిందకు వస్తూ దుండగుడి దురాగతాన్ని గమనించింది. వృద్ధురాలితో ఘర్షణ పడుతూ ఆమెను కత్తితో తీవ్రంగా గాయపరుస్తుండగా విమల అడ్డుకుంది. ఈక్రమంలో నిందితుడు అదే కత్తితో విమలను పొడిచి పరారు కాగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన వృద్ధురాలు కళావతమ్మ ఇచ్చిన వివరాలు, డాగ్‌స్క్వాడ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇదే పంచాయతీ గోపన్నగారిపల్లికి చెందిన మోహన్ (28) హత్య చేసినట్లు నిర్ధారించుకున్న పోలీసులు మంగళవారం సాయంత్రం పులిచెర్ల రైల్వేస్టేషన్ వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. ఈ మేరకు బుధవారం నిందితుడు మోహన్‌ను రిమాండ్ నిమిత్తం పాకాల కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వరసిద్ధుడి ఆలయానికి టెండర్ల ఆదాయం రూ.1.06 కోట్లు



టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయానికి ఆన్‌లైన్ టెండర్లు, సీల్డ్ టెంటర్లు, బహిరంగ వేలాల ద్వారా రూ.1,06,99,997 ఆదాయం బుధవారం లభించింది. ఆలయ కార్యాలయ భవన ఆవరణలో టెండర్లను నిర్వహించారు. దుకాణాల సముదాయంలో హోటల్ నిర్వహించే హక్కును హెచ్చుపాటదారుడు రూ.54,63,000 కైవసం చేసుకున్నాడు. భక్తుల పాదరక్షల భద్రపరచుకునే హక్కు కోసం హెచ్చుపాటదారుడు రూ.24,56,997 దక్కించుకున్నారు. వినాయక సదన్ వద్ద హోటల్ నిర్వహణ కోసం టెండరు దారుడు రూ.27,10,000 చేజిక్కించుకున్నాడు. మరగదాంబిక కల్యాణ మండపం వవద్ద దుకాణం నిర్వహణను రూ.70వేలతో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచలకిషోర్, డీఈవో సాగర్‌బాబు, ఏఈవో ధనంజయ, సూపరింటెండెంట్ బాలరంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



తిరుపతితో బుధవారం జరిగిన మనఊరు మన జెండా కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, స్థానిక నేత నవీన్‌కుమార్ రెడ్డి తదితరులు

సామిరెడ్డిఒడ్డు కాలువలో అక్రమ నిర్మాణాలు



సామిరెడ్డిఒడ్డు కాలువలో అక్రమంగా వెలసిన నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలకు సిద్ధంగా ఉంచిన గ్రావెల్

పాకాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలతో పాకాల - ఇరంగారిపల్లె పంచాయతీల పరిధిలోని సామిరెడ్డి ఒడ్డు చెరువు కాలువ కనుమరుగవుతోంది. అటవీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు పూలవానికుంటకు చేరుకుని అక్కడి నుంచి హైస్కూల్ పక్కన ఫకీరుపేట మీదుగా రైల్వే బ్రిడ్జి కిందనుంచి భారతం మిట్ట మీదుగా సామిరెడ్డి ఒడ్డు చెరువుకు చేరుతాయి. కాలువ స్థలంలో పలుచోట్ల అక్రమ కట్టడాలు వెలిశాయి. దీంతో ఈ కాలువ చిన్నదిగా మారిపోయింది. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలు తొలగించి, కాలువకు ఇరువైపులా కాంక్రీట్ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయ కాలభైరవ హోమం



ప్రత్యేకాలంకారంలో కాలభైరవస్వామి, సిద్ధేశ్వరానంద భారతికి పుష్పాభిషేకం

రామచంద్రాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో బుధవారం మృత్యుంజయ కాలభైరవ హోమం నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మ వారితోపాటు కాలభైరవస్వామికి తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9 గంటలకు 11వేల గారెలతో వేదపండితులు హోమాన్ని ప్రారంభించగా మధ్యాహ్నం 12 గంటలకు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి పూర్ణాహుతితో ముగించారు. అనంతరం సిద్ధేశ్వరానంద భారతికి వివిధ రకాల పుష్పాలతో అభిషేకం చేశారు. భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

నారాయణ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



ప్రారంభ సభలో శాప్ చైర్మన్ రవినాయుడు, ఎస్పీ సుబ్బరాయుడు

చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం సమీపంలోని నారాయణ విద్యా సంస్థల్లో జిల్లా అంతర కళాశాలల క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎస్పీ సుబ్బరాయుడు, నారాయణ విద్యాసంస్థల అధ్యక్షుడు పునీత్, ఒలంపిక్ హాకీ క్రీడాకాణిణి రజిని పాల్గొన్నారు. పునీత్ మాట్లాడుతూ విద్యార్థులను చదువులోనేగాక అన్ని రంగాలలో అత్యుత్తమంగా నిలిపేందుకు క్రీడలను పాఠ్యాంశంగా చేర్చామన్నారు. రవినాయుడు మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, ప్రోత్సాహన్ని వివరించారు. ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్నే కాకుండా మానసిక ధృడత్వాన్ని కలుగచేస్తాయని తెలిపారు. రజని మాట్లాడుతూ క్రీడల వల్లే తాను అంతర్జాతీయ గుర్తింపు పొందానని పేర్కొన్నారు. నారాయణ వంటి కార్పొరేట్ విద్యాసంస్థలు క్రీడలకు ప్రోత్సాహమివ్వడం అభినందనీయమన్నారు. తిరుపతి నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 17 కళాశాలల్లోని పదివేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మాజీ, కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్స్ వేణుగోపాల్, చక్రవర్తి, సురేష్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలిరెడ్డిగారిపల్లిలో ఏనుగుల బీభత్సం

- వరి, మామిడి, కొబ్బరి, అరటి, వక్కచెట్లు ధ్వంసం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట, వక్క చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పొలాలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టిస్తున్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేయడంతో వరి, కొబ్బరి, మామిడి, అరటి, వక్క చెట్లకు అపారనష్టం జరిగింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు బాలిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. ముందుగా దేశిరెడ్డిగారిపల్లిలోని రవీంద్రారెడ్డి, కేశవులరెడ్డిలకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగుల గుంపు డ్రిప్ పైపులను తొక్కేశాయి. అక్కడి నుంచి బాలిరెడ్డిగారిపల్లి , జాంద్రపేట, దేశిరెడ్డిగారిపల్లెల్లోని రైతులకు చెందిన వరి, కొబ్బరి, మామిడి, అరటి, వక్క చెట్లను ధ్వంసం చేశాయి. అనంతరం అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. బుధవారం పగలంతా అడవిలోని బోడబండ వద్ద ఏనుగుల గుంపు సంచరించినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు మధు, కృష్ణమూర్తి తెలిపారు.

కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల నిరసన



తిరుపతి (నేరవిభాగం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కమర్షియల్ ట్యాక్స్ (జీడీటీ) ముందు బుధవారం మధ్యాహ్నం ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఏపీ కమర్షియల్ టాక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జీఎం రమేష్ కుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ కె.చెన్నకేశవులు, ప్రధాన సలహాదారు బి.గోపాలకృష్ణ, ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. కింది స్థాయి ఉద్యోగులను జాయింట్ కమిషనర్ కొట్టడం, తిట్టడం, కులం పేరుతో దూషించడంపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందించారు.

ముగిసిన వరసిద్ధుడి పవిత్రోత్సవాలు

ఐరాల(కాణిపాకం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం మహా పూర్ణాహుతిని వైభవంగా నిర్వహించడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఉదయం ఈవో పెంచలకిషోర్ సిబ్బందితో కలిసి పవిత్రోత్సవాల పూజా సామగ్రిని పండితులకు అందించారు. అలంకార మండపం వద్ద ఉన్న కల్యాణ వేదికపై పండితులు అవబృథ యాగం, స్థండిలమండలేశ్వర పూజ, హోమ వ్రత సమర్పణ, మహా పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, మహాపూర్ణాహుతి, మహా దీపారాధన, యాత్రా దానం, స్వామికి మహాస్నపనం, కుంభ చండీయాగం, దీపారాధనను నిర్వహించారు. డీఈవో సాగర్‌బాబు, ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

అబ్బుగుండులో చిరుత సంచారం



చిరుత పాదముద్రలు

ఐరాల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):ఐరాల మండలం అబ్బుగుండు గ్రామంలో బుధవారం చిరుత సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం పుత్రమద్దిలో ఓ దూడను చిరుత చంపిన సంగతి తెలిసిందే. ఈ ప్రాంతానికి సమీపంలోని అబ్బుగుండులో చిరుత పాదముద్రలను గుర్తించిన యువకులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు.అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకుని పాదముద్రలను పరిశీలించారు. డిప్యూటీ రేంజ్ అధికారి రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ఎవ్వరు అటవీ ప్రాంతంలో పశువులను మేపడానికి వెళ్లవద్దన్నారు. రాత్రి సమయంలో చిత్తూరు నుంచి ఐరాలకు ద్విచక్ర వాహనంలో వచ్చేవారు అప్రమత్తంగా గ్రామస్తులు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైల్వేస్టేషన్ లిఫ్ట్‌లో ఇరుక్కున్న దంపతులు

అరగంట తరువాత సురక్షితంగా బయటకు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో దంపతులు లిఫ్ట్‌లో ఇరుక్కున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే లోకల్ మెమూ రైలు బుధవారం సాయంత్రం 3:30 గంటలకు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లోని 1వ నెంబరు ప్లాట్‌ఫారంలో ఆగింది. అందులో నుంచి దిగిన భార్య, భర్త మూడో నెంబరు ప్లాట్‌ఫారంలోకి వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ మధ్యలో ఆగిపోవడంతో ఆందోళనకు గురైన ఆ దంపతులు భయాందోళనకు గురయ్యారు. లిఫ్ట్ లోపల ఉన్న టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగా రైల్వే టెక్నికల్ సిబ్బంది వచ్చి అరగంట పాటు శ్రమించి మరమ్మతులు జోర్ తెరవడంతో దంపతులు సురక్షితంగా బయటకు వచ్చారు. చెన్నైకి చెందిన వారు షార్ ఉద్యోగుల కాలనీలో బంధువుల ఇంటికి వచ్చినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడికి 4 నెలల జైలు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారణమైన మోటారు సైకిలిస్టుకు నాలుగు నెలల జైలు శిక్ష పడింది. రెండేళ్ల క్రితం సూళ్లూరుపేట మండలంలోని వెలగల పొన్నూరు గ్రామానికి చెందిన వేలమూరు పవన్ కుమార్ మోటారు సైకిల్‌పై వెళ్తూ మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన గోను మునస్వామిరెడ్డిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో మునస్వామిరెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన పవన్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో మంగళవారం నిందితుడికి జైలు శిక్ష పడింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగు నెలల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి సంయుక్త తీర్పు ఇచ్చారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ వాదించారు.

రాయితీ రుణాల పేరిట రూ.25 లక్షల టోకరా: ఇద్దరి అరెస్టు

నాయుడుపేట టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌డీ సంస్థ పేరిట పేదలకు ఇళ్లు, కార్లు రాయితీతో మంజూరు చేస్తామని నమ్మించి పలువురి నుంచి రూ.25లక్షలు టోకరా పెట్టిన ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మీడియాకు వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన మేరకు వివరాలు... బాలయపల్లికి చెందిన గురుప్రసాద్ అలియాస్ ప్రసాద్ రెడ్డి, ఓజిలి మండలం కుందాం గ్రామానికి చెందిన శిల్పప్రియాంక ఏపీఆర్‌డీ పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ఏజెంట్లను నియమించు కుని పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, కార్లు రాయితీతో అందజేస్తామని పలువురిని నమ్మించారు. ఇందుకోసం ముందుగా డిపాజిట్లు చెల్లించాలంటూ నాయుడు పేట పరిసర ప్రాంతాల్లో రూ.25 లక్షలు వసూలు చేశారు. డబ్బులు కట్టించుకుని ఎన్నాళ్లయినా స్పందించకపోవడంతో నాయుడుపేట మండల ఏపీఆర్‌డీ ఏజెంట్ సాధన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ప్రసాద్‌రెడ్డి, శిల్పప్రియాంకలను అరెస్టు చేసి, వారివద్ద నుంచి అగ్రిమెంట్లు, ప్రామిసరీ నోట్లు, నకిలీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

తిరుపతి

క్రీడాకారులకు శాప్ చైర్మన్ అభినందన



వైభవరామ్, త్రిపురాంబికలను సన్మానిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలలో తిరుపతికి చెందిన వైభవరామ్ విజయం సాధించి, జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. మంగోలియా దేశంలో జరిగిన ఆసియా స్కూల్స్ బ్లిడ్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన త్రిపురాంబిక ప్రతిభ కనబరిచింది. వారు బుధవారం స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించి మరిన్ని టోర్నీలలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో శశిధర్ పాల్గొన్నారు.

స్వర్ణముఖి నది హద్దులను గుర్తించండి



సమీక్షిస్తున్న తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది సరిహద్దులను త్వరితగతిన గుర్తించాలని తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం తుడా కార్యాలయంలో ఆయన సమీక్షించారు. ఆపరేషన్ స్వర్ణలో భాగంగా స్వర్ణముఖి నదిని సమగ్రంగా ప్రక్షాళన చేస్తున్నట్లు చెప్పారు. సరిహద్దులను నిర్ణయించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, తుడా, ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని సర్వే పారదర్శకంగా ఉండేలా చూడాలన్నారు. అదే సమయంలో ఆక్రమణలను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామ్మోహన్, తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్‌బాబు, సర్వే డిపార్ట్‌మెంట్ ఏడీ అరుణ్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వరప్రసాద్, శివారెడ్డి, తహసీల్దారు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికి డైరెక్టర్ పదవులు



కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న మురళి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని చెప్పడానికి ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్ల పోస్టులే నిదర్శనమని తిరుపతి టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళి అన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ సీనియర్ నాయకులు ఎస్వీఎం సుబ్రహ్మణ్యం కుమారుడిని మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, తోట వాసుదేవను కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం అభినందనీయమన్నారు. వారిని పులుగోరు మురళీ కృష్ణారెడ్డి బుధవారం సన్మానించారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, మాజీ చైర్మన్ భరణి యాదవ్, టీడీపీ పార్టీ తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి శరత్, గెంజి సుధాకర రెడ్డి, జలపోతు చంద్రశేకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సమ్మిట్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సెనేట్ హాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సమ్మిట్ ఘనంగా నిర్వహించారు. రూసా, డీఆర్‌డీఏ, స్టార్టప్ అడ్వైజరీ ఫోరం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ ఎంటర్‌ప్రైనర్స్, స్టూడెంట్స్, ఇన్నోవేటర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్‌టీఐహెచ్ కంపెనీ సీఈవో విజయ్ మార్తూరు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్టార్టప్-ఎంఎస్‌ఎంఈ ఫోరంచైర్మన్ ఆర్‌ఎస్ రామిరెడ్డి, రూసీ సీఈవో కృష్ణ, సిడ్బీ ఏజీఎం కామేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు. పలువురి సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు.

వైసీపీ నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అభినయ్, మేయర్ శిరీష, జయచంద్రారెడ్డి

తిరుపతి(జీవకోన), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం తిరుపతిలో నిరసన ర్యాలీ చేపట్టారు. కొర్లగుంట ప్రధాన మార్గంలో నిర్వహించిన ఈ ర్యాలీని ఉద్దేశించి వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు తక్కువ ఖర్చుతో వైద్యవిద్యను అభ్యసించే అవకాశాన్ని కోల్పోతారన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సెల్‌ఫోన్లు తీసుకోవడం అన్యాయం



టీటీడీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ గెస్ట్‌హౌసుల్లో విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎంఎస్ కార్మికుల నుంచి నిర్వాహకులు సెల్ ఫోన్లు తీసుకోవడం అన్యాయమని టీటీడీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.సుబ్రమణ్యం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.జయచంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు కేటీ రోడ్డులోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులతో పనులు చేయించుకోవాలే గాని సెల్‌ఫోన్లు తీసుకొని వేధించడం నేరమన్నారు. టీటీడీ ఉద్యోగులకు లేని నిబంధన కార్మికులకు ఎందుకని ప్రశ్నించారు. దీనిపై టీటీడీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవోకు వినతిపత్రాలు ఇచ్చారు. నాయకులు బుజ్జి, మాధవ్, ఆర్.లక్ష్మి, వేణుగోపాల్, సిద్దయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

యువతే దేశ సంపద

● టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి



పురస్కారం స్వీకరిస్తున్న భావనారెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశానికి సంపదని టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ విద్యార్థుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యువత చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చదువు ద్వారా మాత్రమే సంఘంలో గౌరవం కలుగుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులకు శ్రీవెంకటేశ్వర ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ నరసింగరావు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ భరత్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ. చౌదరి, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ వెంకటరమణయ్య, వై.సురేంద్ర బాబు, సాయి, సత్యనారాయణ, డాక్టర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం



మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానిక బీజేపీ నేతలు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు12(ఆంధ్ర జ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు బుధవారం రైల్వేస్టేషన్‌లో ఆ పార్టీ స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇందులో గుండాల గోపీనాథ్‌రెడ్డి, టి.సుబ్రమణ్యం రెడ్డి, పి.భాస్కర్, ఆర్.విశ్వనాథ్, ఎ.రెడ్డిశేఖర్‌రెడ్డి ఉన్నారు.

బాలల హక్కులను హరించడం సరికాదు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న బాలల దినోత్సవం రోజున పరీక్షలు నిర్వహించడం సరికాదని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అది బాలల హక్కులను హరించడమే అవుతుందని పేర్కొన్నారు. ఏటా నవంబరు 14న పిల్లలకు ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చేవారని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వాలు ఈ నిర్ణయంపై పునరాలోచన చేయాలని కోరారు.

తిరుమలలో మంత్రి పార్థసారథి



మంత్రికి స్వాగతం పలుకుతున్న అధికారులు

తిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. శ్రీకృష్ణ అతిథి గృహానికి బుధవారం రాత్రి చేరుకున్న మంత్రికి టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి గురుస్వామి స్వాగతం పలికారు. కాగా, మంత్రి గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.



తిరుపతికి వచ్చిన కంచి కోమకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకుంటున్న ఎమ్మెల్సీ, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

రోడ్డు నిర్మాణం పూర్తయ్యేనా?

● రెండేళ్లుగా అడుగు ముందుకు పడని వైనం





గుంతల రోడ్డులో అవస్థలు పడుతున్న వాహనదారులు - అర్ధాంతరంగా ఆగిన వంతెన పనులు

తిరుపతి అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మంగళం నుంచి శెట్టిపల్లి రైల్వేగేటు వరకు వందడుగుల రోడ్డు నిర్మాణం నత్తనడకన సాగుతోంది. ఈ రోడ్డు తుడా పరిధిలో ఉన్నా భక్తులకు సౌకర్యంగా ఉంటుందని గత వైసీపీ ప్రభుత్వం టీటీడీకి అప్పగించింది. 2023 చివర్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆరు నెలలు జరిగిన తర్వాత అడ్డంకులు ఎదురయ్యాయి. ఆ రోడ్డుకు ఇరువైపులా భూమిలో తెలుగుగంగ నీరు సరఫరా పైపులున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా తవ్వే సమయంలో ఆ పైపులు పగిలిపోయి నీరు వృథా అవుతోంది. ఈ సమస్య కారణంగా పనులు ముందుకు కదల్లేదు. ఇంతలో ఎన్నికలుజరిగి ప్రభుత్వం మారింది. ఈ క్రమంలో టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో అవకతవకలు జరిగాయని విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దీంతో రోడ్డు పనులను ఆపేశారు. అంటే గతేడాది ఆగస్టు నుంచి పనులు ఒక ఇంచ్ కూడా ముందుకు సాగలేదు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జిని కూలదోసి కొత్తగా నిర్మాణం చేపట్టారు. ఆరు నెలలుగా సగం కూడా పూర్తికాలేదు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండే రోడ్డును పాడు చేశాడు. ప్రత్యామ్నాయ రోడ్డు కూడా సరిగా ఏర్పాటుచేయలేదు. ప్రస్తుతం ప్రజలు పది కిలోమీటర్లు చుట్టుకుని గమ్యస్థానాలకు చేరుతున్నారు. రోడ్డు పూర్తి చేయాలనే ఆలోచన అటు తుడాకు గాని, ఇటు టీటీడీకి గాని లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

రుయాలో పొంగుతున్న

మ్యాన్‌హోల్

● మురుగునీటి ప్రవాహంతో రోగులు, వైద్య విద్యార్థుల అవస్థలు



మ్యాన్‌హోల్ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

తిరుపతి(వైద్యం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రోగాలను నయం చేసుకునేందుకు రుయా ఆస్పత్రికి వస్తే కొత్తవి అంటగట్టుకుని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. రోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో పలు మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు బయటకు వచ్చి రోడ్లపైకి ప్రవహిస్తోంది. బర్న్ వార్డు నుంచి జిరియాట్రిక్ వార్డుకు వెళ్లే మార్గంలో ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. దీంతో అక్కడి వార్డుల్లోని రోగులతోపాటు సమీపంలోని ఎంబీబీఎస్ ఉమెన్స్ వసతిగృహంలోని వైద్య విద్యార్థులు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఈ మురుగునీరు సమీపంలో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ కిందకు చేరుతుండటంతో అటుగా వెళ్లే వారు విద్యుత్తు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్వీయూ మెన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



తారకరామ స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్

తిరుపతి(క్రీడలు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక తారకరామ మైదానంలో ఎస్వీయూ మెన్ క్రికెట్ 2025-26 టోర్నమెంట్ బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 కాలేజీల జట్లు తలపడుతున్నాయి. ఈ పోటీలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి.

తొలి రోజు జరిగిన మ్యాచ్‌ల వివరాలిలా...

●చిత్తూరు వీసీఆర్ డిగ్రీ కాలేజీపై తిరుపతి ఎమరాల్డ్స్ డిగ్రీ కాలేజీ విజయం

●కుప్పం డిగ్రీ కాలేజీపై పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గెలుపు

●కార్వేటనగరం డిగ్రీ కాలేజీపై చిత్తూరు విజయం డిగ్రీ కాలేజీ గెలుపు

●గేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టడీస్‌పై శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విజయం

●తిరుపతి గేట్ డిగ్రీ కాలేజీపై తిరుపతి బీఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ గెలుపు

●పాకాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీపై తిరుపతి ఫస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ విజయం

కార్మిక హక్కుల కోసం

పోరాటాలకు సిద్ధం కండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కోరారు. తిరుపతి బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం హమాలీలకు ఒకరోజు రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. పాలక పక్షాలు కార్పొరేట్‌లకు దోచిపెట్టడానికి పటిష్టంగా ఉన్న కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేస్తున్నారని వెల్లడించారు. దీనిపై కార్మికులు అవగాహన చేసుకుని చైతన్యవంతులు కావాలన్నారు. 8 గంటల పని విధానం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు రాజశేఖర్, కేవీ.రమణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాబు, గణేష్, పార్థసారథి పాల్గొన్నారు.

వైసీపీ ఫేక్ మెయిల్స్ రాజకీయం

● గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై వైసీపీ ఫేక్ మెయిల్స్ ద్వారా దుష్ప్రచారం చేస్తోందని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో గోశాల, ఆ తర్వాత విగ్రహాలు, నేడు వేదపారాయణదార్ పోస్టులపై సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. వేదపారాయణదార్ పోస్టులను తమిళనాడు వారికి కట్టబెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిన టీటీడీలోని వైసీపీ సంబంధిత బ్యాచ్ కుట్రలను చైర్మన్ బీఆర్ నాయుడు భగ్నం చేశారని, దీన్ని జీర్ణించుకోలేక రెండు రోజులుగా ఫేక్ మెయిల్ ఐడీలను సృష్టించి పిచ్చికూతలు కూస్తున్నారని తెలిపారు. తెలుగు ప్రాంత వేద పండితులకు పెద్ద పీట వేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగానే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రక్షాళన చర్యలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. వేద పారాయణదార్ పోస్టుల్లో వైసీపీ హయాంలో తెలుగువారికి అన్యాయం జరిగిందని, తప్పుడు సమాచారం చేరవేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అధ్యాపకుడి అవతారమెత్తిన ఎస్వీయూ వీసీ

● ఫిజికల్ కెమిస్ట్రీపై విద్యార్థులకు అవగాహన కల్పించిన నరసింగరావు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ వీసీ నరసింగరావు కాసేపు అధ్యాపకుడి అవతారమెత్తారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన ఫిజిక్స్ విభాగాన్ని బుధవారం సందర్శించారు. ఫిజికల్ కెమిస్ట్రీ అంశంపై గంటపాటు ఎమ్మెస్సీ ఫిజిక్స్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. పారిశ్రామికరంగంలో వారికి ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఎంతో విలువైన సమయాన్ని ఫిజిక్స్ విద్యార్థుల కోసం వెచ్చించిన వీసీకి ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాదరాజు కృతజ్ఞతలు తెలిపారు. శాలువా, పుష్పగుచ్ఛంతో ఫిజిక్స్ అధ్యాపకులు ఆయన్ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మావతి, ఫిజిక్స్ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీకి ప్రత్యేకంగా అకౌంట్ ఆఫీసర్

● టీటీడీ ఈవో సింఘాల్

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీబీసీ(శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్)లో ఆర్థిక అంశాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రభుత్వం నుంచి లేదా, అటానమస్ సంస్థ నుంచి ప్రత్యేకంగా అకౌంట్స్ ఆఫీసర్‌ను నియమించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఎస్వీబీసీ బోర్డు మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, ఎస్వీబీసీ ద్వారా మరింత నాణ్యమైన ప్రసారాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సమీక్షలో ఎస్వీబీసీ ఇంచార్జి సీఈవో ఫణికుమార్ నాయుడు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి గన్‌మెన్ కేటాయింపు

సత్యవేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డికి ప్రభుత్వం భద్రతను పెంచింది. శంకర్‌రెడ్డికి వన్ ప్లస్ వన్ గన్‌మన్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నియోజకవర్గంలో చురుకుగా తిరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్న శంకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఓ వర్గం గందరగోళ పరిస్థితులను సృష్టించే ప్రయత్నం చేస్తోందని ప్రభుత్వానికి సమాచారం అందడంతో భద్రత కారణాల దృష్ట్యా వన్ ప్లస్ వన్ గన్‌మన్ ఏర్పాటు చేసింది.


'కిష్కింధపురి' విజయంతో కొండకు వచ్చా!

● హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్



తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన 'కిష్కింధపురి' సినిమా విజయవంతం అయిన సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామికి, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తన తదుపరి చిత్రం 'హైందవ'ను కూడా ఇదే స్థాయిలో ఆదరించి విజయాన్ని ఇవ్వాలని కోరుకున్నానన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 25 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.30 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,367

తలనీలాలు సమర్పించినవారు: 22,369

అటు కల్తీ నెయ్యి.. ఇటు పరకామణి

తిరుపతిలో ముమ్మరంగా టీటీడీ కేసుల విచారణ



సిట్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ధర్మారెడ్డి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీటీడీకి సంబంధించి కల్తీ నెయ్యి, పరకామణిలో చోరీ కేసులకు సంబంధించి తిరుపతిలో ముమ్మరంగా విచారణ జరుగుతోంది. ఒకవైపు సీఐడీ.. మరోవైపు సీబీఐ భాగస్వామ్యమున్న సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది.

● తిరుపతిలోని టీటీడీ భూదేవి కాంప్లెక్సులో సీబీఐ డీఐజీ మురళీ రాంబా నేతృత్వంలోని సీబీఐ డీఎస్పీలు, సిట్ దర్యాప్తు అధికారి వెంకట్రావు ఇతర పోలీసు అధికారులు కల్తీ నెయ్యి కేసులో బోలేబాబా డెయిరీ డైరెక్టర్లు పొమిలిజైన్, విపిన్‌జైన్‌తో పాటు టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని మంగళ, బుధవారాల్లో విచారించారు. దీంతో ఇక్కడ కూడా హడావుడి నెలకొంది.

● మరోవైపు శ్రీ పద్మావతి అతిథి గృహం కేంద్రంగా వారం రోజులుగా పరకామణిలో జరిగిన చోరీ కేసును హైకోర్టు ఆదేశాల మేరకు ఏకంగా సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసులో నిందితుడు రవికుమార్, అతడి కుటుంబ సభ్యులను తొలుత విచారించారు. ఆ తర్వాత ఈ కేసు సమయంలో తిరుమలలో వన్‌టౌన్ సీఐగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మీరెడ్డి, అప్పటి టూ టౌన్ సీఐ చంద్రశేఖర్, పరకామణి డిప్యూటీ ఈవో మల్లికార్జునరావు, టీటీడీ సెక్యూరిటీ అధికారులు సుబ్బరాజు, రామచంద్ర, సీసీ కమాండ్ యూనిట్ గార్డు చంద్రతో పాటు జయచంద్రారెడ్డిని విచారించి వాంగ్మూలం నమోదు చేశారు. దీంతో అధికారుల రాకపోకలు, విచారణ కోసం వస్తున్న వారితో పద్మావతి అతిథి గృహం సందడిగా మారింది.

● ఇంకోవైపు పరకామణి చోరీ కేసులో నిందితుడైన రవికుమార్.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఏసీబీ విచారిస్తోంది. ఈ కేసు కూడా తిరుపతి కేంద్రంగా నడుస్తోంది. జరుగుతుంది.

◆ 'పరకామణి' కేసులో

టీడీపీ జోక్యం ఉండదు

● నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయండి ● సీఐడీ డీజీని కోరిన వర్ల రామయ్య



సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో మాట్లాడుతున్న వర్ల రామయ్య

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసుపై సీఐడీ జరుపుతున్న దర్యాప్తులో టీడీపీ జోక్యం ఉండదని, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలంటూ ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్‌ను కోరారు. బుధవారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహం కాన్ఫరెన్సు హాలులో ఆయన టీడీపీ నేతలతోపాటు సీఐడీ చీఫ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీవారి పరకామణిలో ఎన్ని వందల కోట్లు కొట్టేశారో తెలియాల్సి వుందన్నారు. ఈ కేసును నెలలోనే లోక్ అదాలత్‌లో రాజీ చేయడం వెనుక ఎవరున్నదీ ప్రజలకు తెలియాల్సి వుందన్నారు. హైకోర్టు ఇచ్చిన సమయం చాలకపోతే ఇంకా వ్యవధి తీసుకుని వాస్తవాలను వెలుగులోకి తేవాలని కోరారు. టీటీడీకి ఆస్తులను బదిలీ చేసిన సమయంలో స్టాంప్ డ్యూటీ ఎవరు చెల్లించారో తేల్చాలన్నారు. దీని వెనుక ఎంత పెద్దవారున్నా వదలిపెట్టవద్దని కోరారు. నిక్కచ్చిగా, నిర్భయంగా విచారణ చేయాలని అభ్యర్థించారు. పరకామణి చోరీ కేసు రాజీకి కర్త, కర్మ, క్రియ అంతా భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, ధనంజయరెడ్డిలేనని ఆరోపించారు. వారి కుటుంబీకులు, బంధువుల ఆస్తులు వెలికి తీయాలని, పరకామణి చోరీ నిధులతో ఆస్తులు ఎక్కడెక్కడ కొనుగోలు చేశారో నిగ్గు తేల్చాలని కోరారు. దర్యాప్తులో తేల్చాల్సిన పలు సందేహాలకు సంబంధించి 27 అంశాలతో వినతి పత్రం ఇచ్చారు. ఆయన వెంట ఆయన వెంట తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఏపీ జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు శ్రీధర్ వర్మ, కుమారమ్మ, మహేష్ యాదవ్, సూరా సుధాకరరెడ్డి, రజనీకాంత్ నాయుడు, పాలకం వెంకటేష్, వట్టికుంట శంకర్ తదితరులున్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నుంచీ వినతి పత్రాన్ని తీసుకున్న సీఐడీ చీఫ్ రవి శంకర్ అయ్యన్నార్.. ఆ పత్రాన్ని హైకోర్టుకు అందజేస్తామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామన్నారు. లోతుగా విచారించి నిందితులకు శిక్ష పడేలా చూస్తామన్నారు. దేవుడి ఆస్తికి సంబంధించిన కేసు కాబట్టి నిర్భయంగా దర్యాప్తు చేస్తామని, దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

పళ్లికొండేశ్వరాలయ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

● చైర్మన్ పద్మనాభరాజు



నూతన పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

నాగలాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానం సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు చెప్పారు. బుధవారం ఆలయ సమావేశ మందిరంలో పాలక మండలి మొట్టమొదటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. దేవస్థానంలో ఉన్న గోశాలలో 56 గోవుల సంరక్షణకు ఇద్దరు కార్మికులు సరిపోకపోవడంతో మరో కార్మికుడిని నియమించుకోవాలని తీర్మానించారు. నిత్యం స్వామిఅమ్మవార్ల అభిషేకాలు ప్రారంభయ్యే సమయానికి గోపూజ నిర్వహించాలని, నైవేద్యం భక్తులందరికీ అందేలా దిట్టం పెంచాలని తీర్మానించారు. మరో ఇద్దరు అర్చకులను, అటెండరు నియామకానికి దేవదాయ శాక ఆమోదానికి పంపాలని ఈవో లతను కోరారు. కారిడార్ మరమ్మతులు పూర్తి చేసి భక్తుల బసకు ఏర్పాటు చేస్తామన్నారు. దాతల సహకారంతో మరో 8 వసతి గృహాలు నెల రోజుల్లో పూర్తి చేస్తున్నామన్నారు. 2026 ఫిబ్రవరిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లపై ముందస్తు చర్చలు వేశారు. ఉభయదారులకు ఉభయపైకం రూ.35 వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని తీర్మానించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కృష్ణయ్య, వెల్సన్ మండేలా హంస, దేవి, జయంతి, కవిత, నాగభూషణమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి



రంజిత్ నాయుడు, బాబురాజు

వడమాలపేట,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి-చెన్నై జాతీయ రహదారి తడుకు ఆర్.ఎస్. వద్ద ఇద్దరు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని మృతి చెందారు. విజయపురం మండలం కేవీపురానికి చెందిన రంజిత్ నాయుడు(52), ఎస్‌బీఆర్‌పురానికి చెందిన బాబురాజు అలియాస్ నరసింహరాజు (51) రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపుగా వెళ్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వడమాలపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాఖకు మరో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు

- బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు -

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో మరో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులతో 50 దేశాలకు చెందిన సంస్థలు విశాఖపట్నంలో కంపెనీలు పెట్టే అవకాశం ఉందని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఇప్పటికే దాదాపు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో అనేక సంస్థలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. కాగా ఢిల్లీ బాంబ్ బ్లాస్ట్ నేరస్తులను శిక్షించే శక్తిని ప్రధాని మోదీ, అమిత్ షాలకు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు. ఇలా ఉండగా వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా బుధవారం స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

నేటి నుంచి 'నృత్య వాహిని'



వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో గురువారం నుంచి 'నృత్య వాహిని' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీసీ ఉమ తెలిపారు. బుధవారం ఆమె రిజిస్ట్రార్ రజని, కన్వీనర్లు వాణి, విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హిమబిందుతో కలిసి మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటలకు ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభిస్తారన్నారు. మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శీల శ్రీధర్ కీలకోపన్యాసం చేస్తారన్నారు. 15వ తేదీ దాకా సాగే ఈ కార్యక్రమంలో 87 మంది దేశ, విదేశీ నృత్యకారులు అనేక నృత్య రీతులను ప్రదర్శిస్తారని చెప్పారు. వివిధ నృత్యాలపై మ్యూజిక్ అండ్ డ్యాన్స్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ హిమబిందు నేతృత్వంలో వర్క్‌షాప్ చేపడుతున్నామని తెలిపారు. సమాపనోత్సవం సందర్భంగా కళాకారులందరూ సామూహిక నృత్య ప్రదర్శన చేస్తారన్నారు.

పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో ఫార్మసీ డిప్లొమా కోర్సుకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్‌లో ఫార్మసీ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి 19వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇందుకోసం 18వ తేదీ దాకా దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ ఉత్తీర్ణత పొందిన విద్యార్థినులు విద్యార్హత సర్టిఫికెట్ల ఒరిజినల్, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాల్సి ఉంటుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తారు. ప్రభుత్వం నిర్ణయించిన కోర్సు ఫీజుతో విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తారు. సమగ్ర సమాచారం కోసం.. 92990 08151 నెంబరులో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు.

ఆలయంలోకి సరుకులు చేర్చేందుకు

కొత్త 'బ్యాగ్ కన్వేయర్'





ప్రస్తుతం వినియోగంలో ఉన్న బ్యాగ్ కన్వేయర్ - నూతన బ్యాగ్ కన్వేయర్

తిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలోకి ముడి సరుకులు చేర్చేందుకు నూతన బ్యాగ్ కన్వేయర్ (బ్యాగ్ స్టాగర్) అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా శ్రీవారికి సమర్పించే అన్నప్రసాదాలు, లడ్డూలు, వడలు, ఇతర ప్రసాదాలన్నీ సంప్రదాయం మేరకు శ్రీవారి ఆలయంలోని పోటు (కట్టెల పొయ్యితో కూడిన వంటశాల)లోనే తయారవుతాయి. ఈమేరకు నిత్యం దాదాపు 50 టన్నుల నుంచి 65 టన్నుల ముడిసరుకులను ఆలయంలోకి పంపాల్సి ఉంటుంది. మహద్వారం నుంచి ఈ సరుకులను తరలించడం అంటే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఈక్రమంలో 35 ఏళ్లగా ఆలయం వెనుకభాగంలో ఉన్న ఉగ్రాణం (ముడిసరుకుల నిల్వ ప్రదేశం) నుంచి టీటీడీ బ్యాగ్ కన్వేయర్ ద్వారా సరుకులను ఆలయంలోకి పంపుతున్నారు. అప్పట్లో చెన్నైకి చెందిన ఓ సంస్థ ఈ బ్యాగ్ కన్వేయర్‌ను విరాళంగా అందించింది. ప్రసాదాల తయారీకి కావాల్సిన సరుకులను చిన్నపాటి మూటలు కట్టి ఈ కన్వేయర్‌పై ఉంచితే దాదాపు 40 అడుగల ఎత్తులో ఉన్న ఆలయ ప్రాకారంపైకి చేరుతాయి. అక్కడి సిబ్బంది ఈ సరుకులను తీసుకుని ప్రసాదాల తయారీకి వినియోగిస్తారు. ఇది ప్రతిరోజు జరిగే ప్రక్రియ. అయితే దాదాపు 35 ఏళ్ల క్రితం నుంచి వినియోగిస్తున్న ఈ బ్యాగ్ కన్వేయర్ నిత్యం మరమ్మతులకు గురవుతోంది. అప్పటికప్పుడు మరమ్మతులు పూర్తిచేసి సిద్ధం చేసినప్పటికీ బ్యాగ్ కన్వేయర్ బాడీ పూర్తిగా దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. కన్వేయర్ కింద నిత్యం భక్తులు కూడా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకూడదనే ముందస్తు జాగ్రత్తగా టీటీడీ నూతన బ్యాగ్ కన్వేయర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఓ దాత సహకారంతో నాగ్‌పూర్ నుంచి నూతన బ్యాగ్ కన్వేయర్‌ను తిరుమలకు తీసుకువచ్చారు. ప్రస్తుతం ఇందులోనే హైడ్రాలిక్, బాడీ వంటి వాటిని పరిశీలన చేస్తున్నారు. రానున్న రెండుమూడు రోజుల్లో దీన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు.

'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయండి

● మహిళా మోర్చాను బలోపేతం చేయండి

● కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'వికసిత్ భారత్' లక్ష్యంగా పనిచేయాలని, మహిళా మోర్చాను బలోపేతం చేయాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన నిషిధారాజు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా బుధవారం నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన వీరు పాల్గొన్నారు. ఉత్పత్తి రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచిన మేకిన్ ఇండియా నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి సూచించారు. ఆత్మనిర్భర భారత్ లక్ష్యంగా పనిచేస్తే ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా ఉన్న దేశాన్ని అగ్రస్థానంలోకి తీసుకెళ్లొచ్చని, దీనికి ప్రజలు, పార్టీ శ్రేణులు కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. నిషిధారాజు ఆధ్వర్యంలో మహిళామోర్చా మరింత బలోపేతమౌతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పెద్ద సంఖ్యలో గెలిపించుకోవాల్సిన అవసరం కూటమిపై ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తోందని ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు తెలిపారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.నిషిధారాజును ఘనంగా సత్కరించి అభినందించారు. బీజేపీ నేతలు విష్ణుకుమార్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, సామంచి శ్రీనివాస్, నాగలక్ష్మి, మాధవి, పార్వతి, యువశ్రీ, విజయలక్ష్మి, ఇతర నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.

చట్టాలను రూపకల్పన చేసిన దార్శనికుడు మోదీ

● లా విద్యార్థులతో కేంద్ర మంత్రి

కాలం చెల్లిన బ్రిటిష్ కాలం నాటి చట్టాలను మార్చి భారతీయ న్యాయ చట్టాలకు రూపకల్పన చేసిన దార్శనికుడు ప్రధాని నరేంద్రమోదీ అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. అంబేడ్కర్ గ్లోబల్ లా కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'స్వశక్త భారత్ - ఆత్మనిర్భర్ భారత్' సదస్సులో ఆయన న్యాయ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ న్యాయ చట్టాలను తీసుకురావడం సాధారణ విషయం కాదన్నారు. న్యాయ విద్యార్థులందరూ వీటిపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. స్థానిక ఉత్పత్తులను మన జీవితంలో భాగం చేసుకుని దేశాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పీవీఎన్ మాధవ్ కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయ విద్యార్థులతో పాటు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఉదయం తిరుపతిలో 'మన ఊరు- మన జెండా' కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరం పళణి థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాధవ్ జెండా ఆవిష్కరించారు. పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పారు.



డైకిన్ పరిశ్రమలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీలో జాగృతి యాత్ర బృందం

శ్రీసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాగృతి యాత్ర బృందానికి చెందిన 525 మంది సభ్యులు గురువారం బుధవారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేసే లక్ష్యంతో ముంబైకి చెందిన జాగృతి సేవా సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఏటా చేపట్టే ఈ జాగృతి యాత్ర, ప్రత్యేక రైలు ప్రయాణం ద్వారా దేశమంతా 8 వేల కి.మీ పర్యటిస్తుంది. వివిధ రంగాల్లో ఆదర్శవంతులను(రోల్ మోడల్) కలుసుకుని వారితో సంభాషించడం ద్వారా యాత్రికుల్లో స్ఫూర్తి నింపుతుంది. శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి యాత్ర బృందానికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక కేంద్రం ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. పర్యటనలో భాగంగా యాత్రికులు శ్రీసిటీ పరిసరాలు, పారిశ్రామిక పురోగతిని నేరుగా వీక్షించడంతో పాటు పలు బ్యాచ్‌లుగా విడిపోయి డైకిన్, బ్లూస్టార్, లావాజ్జా ఈ ప్యాక్, పెప్సికో, అంబర్ రాక్‌వర్త్, బెర్గెన్ పైపు సపోర్ట్స్, ఏఎల్ఎఫ్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, ఎంఎండీ, బ్రేక్స్ ఇండియా, డైకి అల్యూమినియం పరిశ్రమలను సందర్శించారు. శ్రీసిటీ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపారానుకూల వాతావరణం, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, ఉపాధి, వివిధ రకాల ఉత్పత్తుల వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తమ బృందానికి సందర్శన అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి జాగృతి సంస్థ సీఈవో అశుతోష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెట్టుబడులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అపార అవకాశాలు ఉన్న సంపూర్ణ వ్యాపార నగరానికి శ్రీసిటీ ఒక చక్కటి ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. 2016 నుంచి నేటి వరకు 8 పర్యాయాలు తమ బృందం శ్రీసిటీని సందర్శించిందని, ప్రతిసారి సభ్యులతో శ్రీసిటీ చెరగని ముద్ర వేసిందని వ్యాఖ్యానించారు. పరిశ్రమల సందర్శన అనంతరం బుధవారం రాత్రి వారి రోల్ మోడల్‌గా ఎంచుకున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి జాగృతి సభ్యులతో సమావేశమవుతారు. ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా శ్రీసిటీ ప్రయాణం, దార్శనికత, సవాళ్లు, మైలు రాళ్లను వివరిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేస్తారు.

నేటి నుంచి పంచగవ్య వైద్య మహా సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌వర్మ

తిరుపతి(ఎంఆర్ పల్లె), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు పంచగవ్య వైద్య మహాసమ్మేళనం జరగనున్నట్లు సిద్ధాచార్య నిరంజన్‌వర్మ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దేశ నలుమూలల నుంచి పంచగవ్య వైద్యశాస్త్రంపై పనిచేస్తునన శాస్త్రవేత్తలు, గవ్య ఉత్పత్తి నిర్వాహకులు, గోశాల నిర్వాహకులు, గోరక్షకులు సుమారు 1,200మంది ఈ సదస్సులో పాల్గొంటారని తెలిపారు. కొత్త కొత్త విషయాలపై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. పంచగవ్య వైద్యశాస్త్ర విద్యను పూర్తిచేసిన 201మందికి అడ్వాన్స్ డిప్లొమా ఇన్ పంచగవ్య థెరపి సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ గురుస్వామి, ఝాన్సీ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పుత్తూరు టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ కనకంపాళెం పంచాయతీలోని ఆది ఆంధ్ర వాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ నేషనల్ హైవే రోడ్డు పనులు కోసం తాగునీటి పైపులను ధ్వంసం చేశారన్నారు. అలాగే గ్రామంలో వీధి దీపాలు కూడా లేవని, ఈ సమస్యల గురించి పలుమార్లు అధికారులను విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సునీత, భూషణ, లక్ష్మి, శకుంతల, లలిత తదితరులు తెలిపారు.

ధనపాల్‌కు సత్కారం



పుత్తూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ మొదలియార్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధనపాల్‌ను బుధవారం టీడీపీ నాయకులు పూలమాల, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ ఎన్ ధనపాల్ మాట్లాడుతూ... తనకు ఈ పదవి వచ్చిందుకు కారణమైన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పదవిని బాధ్యతగా నిర్వహించి మొదలియార్ వర్గానికి అందుబాటులో ఉండి, వారి అభివృద్ధి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, వ్యవసాయ కమిటీ చైర్మన్ గణేష్ పాల్గొన్నారు.

నెరవేరిన పేదల సొంతింటి కల

ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిర్మించిన ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014-19 కాలంలో టీడీపీ హయంలో 8 లక్షల ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం మరో 3 లక్షల ఇళ్లు పేదలకు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సరుకుల వివరాలను బోర్డులో రాయాలి

వడమాలపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చౌకదుకాణాల్లో సరుకుల వివరాలు తెలియజేసే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు కాంతారావు చెప్పారు. బుధవారం మండలంలోని ఎస్.బీ.ఆర్ పురంలోని చౌకదుకాణాన్ని తనిఖీ చేశారు. వెయ్యింగ్ మెషిన్, రేషన్ కార్డులు సంఖ్య, ఇప్పటికి ఎంతమందికి రేషన్ సరుకులు ఇచ్చారో పరిశీలించారు. 34 బియ్యం బస్తాలు ఉండాల్సి ఉండగా 25 బస్తాలు మాత్రమే ఉండడంతో వ్యత్యాసంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరుపట్టిక, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వడమాలపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పేద పిల్లలకు అందించే భోజనం నాణ్యంగా ఉండాలని, ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. తనిఖీల్లో జిల్లా కమ్యూనిటీ మొబలైజింగ్ అధికారి సురేష్, తహసీల్దార్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

పూతదశకు రైతులు సమాయత్తం కావాలి

వడమాలపేట,నవంబరు 12(ఆంధ్రజ్యోతి):మామిడి పంటకు వాతావరణం అనుకూలంగా ఉందని, పూతదశ వచ్చేందుకు రైతులు సమాయత్తం కావాలని కె.వి.కె ఉద్యానవన శాస్త్రవేత్త సుధాకర్ చెప్పారు. బుధవారం ఎస్వీ పురం పరిధిలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణ ఇచ్చారు. పుత్తూరు ఉద్యానవనశాఖ అధికారి సౌజన్య మాట్లాడుతూ నవంబరు నుంచి సాగుపై దృష్టి సారించాలన్నారు. మల్టీకే, ఫార్ములా 4 పోషకాన్ని లీటరు నీటికి పది గ్రాములు చొప్పున కలిపి 20 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు పిచికారీ చేయాలని చెప్పారు. డిసెంబరులో పూత ప్రారంభమయ్యే దశలో తేనె, లల్లిమసి, పక్షికన్ను తెగుళ్ల సోకే ప్రమాదముందని వీటి నివారణ కోసం మోనోక్రోటోఫాస్ లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.03 గ్రాముల చొప్పున లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూతదశ నుంచి రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఏవో విజయకుమార్ చెప్పారు.

రేపటి పరీక్షను వాయిదా వేసి

బాలల దినోత్సవాన్ని జరపండి: జేవీవీ

రేణిగుంట నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరగాల్సిన పరీక్షను వాయిదా వేసి బాలల దినోత్సవాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని జన విజ్ఞాన వేదిక పేర్కొంది. దేశంలో ఒక్క ఏపీలో 14న బాలల దినోత్సవం రోజు విద్యార్థులకు పరీక్షలు పెడుతున్నారన్నారు.

కేంద్ర మంత్రికి ఘనస్వాగతం



రేణిగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలు శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌కు ఘన స్వాగతం లభించింది. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలాఆనంద్, నాయకులు వేణు ముదిరాజ్, రాజారాయల్, నరేష్‌రాయల్, ఆనంద్ స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

ఘనంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సమ్మిట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ సెనేట్ హాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సమ్మిట్ ఘనంగా నిర్వహించారు. రూసా, డీఆర్‌డీఏ, స్టార్టప్ అడ్వైజరీ ఫోరం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఎంటర్‌ప్రైనర్స్, స్టూడెంట్స్, ఇన్నోవేటర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్‌టీఐహెచ్ కంపెనీ సీఈవో విజయ్ మార్బారు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్టార్టప్ -ఎంఎస్ఎంఈ ఫోరం చైర్మన్ ఆర్ఎస్ రామిరెడ్డి, రూసీ సీఈవో కృష్ణ, సిడ్బీ ఏజీఎం కామేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురి సందేహాలను నిపుణులు నివృత్తి చేశారు.

కార్మిక హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కండి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు12(ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కోరారు. తిరుపతి బైరాగిపట్టిడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం హమాలీలకు ఒకరోజు రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. పాలక పక్షాలు కార్పొరేటర్లకు దోచి పెట్టడానికి పటిష్టంగా ఉన్న కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేస్తున్నారని వెల్లడించారు. దీనిపై కార్మికులు అవగాహన చేసుకుని చైతన్యవంతులు కావాలన్నారు. 8 గంటల పని విధానం కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రొఫెసర్లు రాజశేఖర్, కేవీ.రమణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాబు, గణేష్, పార్థసారథి పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

దుకాణాల్లో తనిఖీలు

30 కిలోల ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్వాధీనం

సూళ్లూరుపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపాలిటీ అధికారులు మంగళవారం దాడులు చేసి 30 కిలోల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య ఆధ్వర్యంలో అధికారులు దుకాణాలను తనిఖీ చేసి 120 మైక్రాన్ లోపు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యాపార దుకాణాలు, చికెన్ షాపులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగుల వాడకం నిషేధించాలన్నారు. అదేవిధంగా ప్రజలు ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయవద్దని, చెత్త బుట్టల్లో వేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు.

పదవులను బాధ్యతగా గుర్తించి పనిచేయండి

వెంకటగిరి, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా గుర్తించి పనిచేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ఆర్ఎల్ కళ్యాణ మండపంలో నియోజకవర్గంలో టీడీపీ మండల అధ్యక్షుల ప్రమాణస్వీకారం జరిగింది. వెంకటగిరి పట్టణ అధ్యక్షుడిగా అవ్వారు సత్యనారాయణ, డక్కిలి అధ్యక్షుడిగా పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, బాలాయపల్లి అధ్యక్షుడిగా రాయి సత్యం నాయుడు, రాపూరు అధ్యక్షుడిగా చెన్ను అశోక్‌రెడ్డి, కలువాయి అధ్యక్షుడిగా రఘురామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టకాలంలో జెండా మోసిన ప్రతి నాయకులు, కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. కొత్తగా పదవులు చేపట్టిన నాయకులు యువతకు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, శ్రీకాళహస్తి ఆలయ బోర్డు సభ్యురాలు రుద్రాక్ష కౌశల్యమ్మ, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, సీసీ నాయుడు, రమణారెడ్డి, మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకార సభలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

అర్హులందరికీ పక్కా గృహాలు: విజయశ్రీ

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరు చేయడానికి ప్రభుత్వ చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం మన్నారుపోలూరులోని పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన గృహాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. 279 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ నిరుపేదలకు గృహాల మంజూరులోనూ రాజకీయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులైన వారందరికి గృహాలు మంజూరు చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతున్నామని, ప్రజలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు, డీఈ దశయ్య ఏఈలు సత్యనారాయణ, శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, నాయకులు మాధవనాయుడు, మునస్వామి, హనుమంతరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కనే గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదం కేసులో

నిందితుడికి 4 నెలల జైలు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి కారణమైన మోటారు సైకిలిస్టుకు నాలుగు నెలల జైలు శిక్ష పడింది. రెండేళ్ల క్రితం సూళ్లూరుపేట మండలంలోని వెలగల పొన్నూరు గ్రామానికి చెందిన వేలమూరు పవన్ కుమార్ మోటారు సైకిల్‌పై వెళ్తూ మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరుకు చెందిన గోను మునస్వామిరెడ్డిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో మునస్వామిరెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారకుడైన పవన్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో మంగళవారం నిందితుడికి జైలు శిక్ష పడింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగు నెలల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సంయుక్త తీర్పు ఇచ్చారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్ వాదించారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల శ్రేయస్సు కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని వాకాడు ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కోటలోని తిన్నెలపూడి సహకార సంఘంలో బుధవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్ రెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్, ఏవో సుచ్చేంద్ర ప్రసాద్, సాయికుమార్ పాల్గొన్నారు.

గ్రామకంఠం కబ్జాపై విచారణ

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి అరుంధతీయవాడలో బుధవారం గ్రామకంఠం భూమి కబ్జాపై అధికారులు విచారణ చేపట్టారు. సర్వే నెంబరు 174లో ఉన్న 3.75 ఎకరాల గ్రామ కంఠం భూమిని స్థానికులు వీధిగా వాడుకుంటున్నారు. ఓ కుటుంబానికి చెందిన వ్యక్తులు ఆ భూమి తమదంటూ ఫెన్సింగ్ రాళ్లు నాటారు. దీంతో గ్రామస్తులు తహసీల్దారు జయజయరావుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దారు వీఆర్వో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి కీర్తన, ట్రైనీ ఎస్ఐ నిఖిల్‌తో పాటు రెవెన్యూ సిబ్బంది వెళ్లి సంఘటనాస్థలాన్ని పరిశీలించి అది ప్రభుత్వ భూమి అని తేల్చారు. వెంటనే ఫెన్సింగ్ రాళ్లను తొలగించాలని కబ్జాదారులను కోరినప్పటికీ వారు అంగీకరించకపోగా అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు ఫెన్సింగ్ రాళ్లను తొలగించారు. గ్రామకంఠం భూమిని కబ్జాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేన కార్యాలయం ప్రారంభం



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉయ్యాల ప్రవీణ్, హరిప్రసాద్

నాయుడుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయాన్ని నాయుడుపేట పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, ఇన్‌చార్జి, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ సాయి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరారు. కార్యక్రమంలో కిలారి గోపీ, గిండి సతీష్, బాలుశెట్టి కేశవరెడ్డి, విజయ్, శ్రీను, మహేష్, రోహిణి, సల్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పడిపూజ

గూడూరు అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌లోని సీతారామాంజనేయస్వామి క్షేత్రంలో బుధవారం అయ్యప్పస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో స్వామివారికి పడిపూజ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో శ్రీధర్‌నాయుడు, మునీంద్ర, నాగరాజు, శివ, పరంధామయ్య, శరత్‌యాదవ్ పాల్గొన్నారు.

సీబీఎన్ బ్రాండ్‌తో పరిశ్రమల వెల్లువ: నెలవల

నాయుడుపేట, నవంబరు, 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు విజనరీ బ్రాండ్‌తో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం నాయుడు పేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొచ్చి పెట్టుబడులను ఆకర్షిస్తున్నారన్నారు. సీఎంతో పాటు మంత్రి లోకేశ్ వివిధ దేశాల్లో పర్యటిస్తూ పరిశ్రమలను తీసుకొచ్చేందుకు అహర్నిషలు శ్రమిస్తున్నారని అన్నారు. దీంతో ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపుతున్నారని, ఇందులో భాగంగానే సూళ్లూరుపేట నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటవుతున్నాయని పేర్కొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం: కురుగొండ్ల

వెంకటగిరి, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల సాకారమవుతోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తిరుపతి రోడ్డులో నిర్మించిన ఎన్టీఆర్ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఇళ్లలో పూజలు నిర్వహించి దంపతులకు బట్టలను పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. ఇళ్ల నిర్మాణాలతో రాష్ట్ర వ్యాప్తంగా పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని చిల్లకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండా రామచంద్రారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చిల్లకూరులోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరైతుకూ అవసరమైనంత యూరియా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యసాయశాఖ అధికారులు గోపీ నాయక్, సీఈవో రాజనేని రామయ్య నాయుడు, భవానీ, కిరణ్మయి, మల్లికార్జున్, దాసరి రాము, బెల్లంకొండ రాజేంద్ర, నెల్లూరు రామ్మూర్తి, దనుంజయ, సోమశేఖర్, వినోద్, రవి, శివకుమార్, సురేష్, మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బయ్య, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో తనిఖీలు

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అక్కంపేట ఆదర్శ పాఠశాలను సమగ్రశిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఉపాధ్యాయుల నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్థాంతరంగా ఆగిపోయిన బాలికల వసతిగృహ నిర్మాణాన్ని పరిశీలించారు. నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, ఎంఈవో మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, సీఆర్‌పీ గోపీనాథ్ ఉన్నారు.

రాచపాళెంలో ఉచిత వైద్య శిబిరం

ఓజిలి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాళెంలో బుధవారం నారాయణ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ముప్పాళ్ళ శారదమ్మ, టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్కే ఖలీల్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాచపాళెంతోపాటు, పెద్దపరియ, పెద్దపరియరాజు పాళెం, చిల్లమానుచేను, పినపరియపాడు, భట్లకనుపూరు గ్రామాలకు చెందిన పలువురికి శిబిరంలో గొంతు, చెవి, ముక్కు, కండ్లు, కీళ్ల సమస్యలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.కృష్ణప్రియ, డాక్టర్ జాహ్నవిప్రియ, డాక్టర్ శరణ్‌కుమార్‌రెడ్డి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మణికంఠన్, క్యాంప్ కోర్డినేటర్ ఎన్.సురేంద్ర కుమార్, బీజేపీ నాయకుడు రవీంద్రరాజు పాల్గొన్నారు.

పాలెంపాడులో పశువైద్యశిబిరం

దొరవారిసత్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పాలెంపాడులో బుధ వారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 85 పశువులకు గర్భకోశ వ్యాధు లకు చికిత్స, 25 పశువులకు సాధారణ చికిత్స అందించి నట్లు పశువైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్లు మునిరాజ, గోవర్ధన్, ధనంజయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు లక్ష్మీప్రసన్న

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ కళా శాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న లక్ష్మీప్రసన్న జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 షూటింగ్ పోటీల్లో లక్ష్మీప్రసన్న కాంస్య పతకాన్ని గెలుచుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం లక్ష్మీప్రసన్నను కరస్పాండెంట్ కోటేశ్వరరావు అభినందించారు.

16న జిల్లాస్థాయి టెన్నికాయిట్ జట్ల ఎంపిక

గూడూరు అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో ఈనెల 16వ తేదీన జిల్లాస్థాయి టెన్నికాయిట్ సబ్ జూనియర్ బాలబాలికల జట్లు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ బుధవారం తెలిపారు.

రైల్వేస్టేషన్ లిఫ్ట్‌లో ఇరుక్కున్న దంపతులు

అరగంట తరువాత సురక్షితంగా బయటకు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో దంపతులు లిఫ్ట్‌లో ఇరుక్కున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే లోకల్ మెమూ రైలు బుధవారం సాయంత్రం 3:30 గంటలకు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లోని 1వ నెంబరు ప్లాట్‌ఫారంలో ఆగింది. అందులో నుంచి దిగిన భార్య, భర్త మూడో నెంబరు ప్లాట్‌ఫారంలోకి వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ మధ్యలో ఆగిపోవడంతో ఆందోళనకు గురైన ఆ దంపతులు భయాందోళనకు గురయ్యారు. లిఫ్ట్ లోపల ఉన్న టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయగా రైల్వే టెక్నికల్ సిబ్బంది వచ్చి అరగంట పాటు శ్రమించి మరమ్మతులు డోర్ తెరవడంతో దంపతులు సురక్షితంగా బయటకు వచ్చారు. చెన్నైకి చెందిన వారు షార్ ఉద్యోగుల కాలనీలో బంధువుల ఇంటికి వచ్చినట్లు తెలిసింది.

రాయితీ రుణాల పేరిట

రూ.25 లక్షల టోకరా: ఇద్దరి అరెస్టు

నాయుడుపేట టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌డీ సంస్థ పేరిట పేదలకు ఇళ్లు, కార్లు రాయితీతో మంజూరు చేస్తామని నమ్మించి పలువురి నుంచి రూ.25లక్షలు టోకరా పెట్టిన ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు నాయుడుపేట అర్బన్ సీఐ బాబి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మీడియాకు వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన మేరకు వివరాలు... బాలయపల్లికి చెందిన గురుప్రసాద్ అలియాస్ ప్రసాద్ రెడ్డి, ఓజిలి మండలం కుందాం గ్రామానికి చెందిన శిల్పప్రియాంక ఏపీఆర్‌డీ పేరిట ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ఏజెంట్‌లను నియమించు కుని పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు, కార్లు రాయితీతో అందజేస్తామని పలువురిని నమ్మించారు. ఇందుకోసం ముందుగా డిపాజిట్లు చెల్లించాలంటూ నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో రూ25 లక్షలు వసూలు చేశారు. డబ్బులు కట్టించుకుని ఎన్నాళ్లయినా స్పందించకపోవడంతో నాయుడుపేట మండల ఏపీఆర్‌డీ ఏజెంట్ సాధన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ప్రసాద్‌రెడ్డి, శిల్పప్రియాంకలను అరెస్టు చేసి, వారివద్ద నుంచి అగ్రిమెంట్లు, ప్రామిసరీ నోట్లు, నకిలీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం



నూతనగృహ ప్రవేశ కార్యక్రమంలో టీడీపీ నేతలు, అధికారులు

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి నూతన గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణమూర్తి, అశోక్, శ్రీధర్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాసులురెడ్డి, హౌసింగ్ డీఈ షబ్బీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో

రోసనూరు విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెళ్లకూరు, నవంబరు, 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడ, కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో రోసనూరు రాజుపాలెం విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-17 పురుషుల రెజ్లింగ్, జూడో పోటీల్లో పదో తరగతి విద్యార్థి కాగితాల ముత్యాలయ్య రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. అదేవిధంగా అండర్-17 మహిళల రెజ్లింగ్‌లో 9వ తరగతి విద్యార్థి పసల నిరోషా సిల్వర్ పతకం సాధించింది. జూడో పోటీల్లో అండర్ -17 విభాగంలో మేర్లపాక చరణ్ సిల్వర్ పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులతో పాటు రెజ్లింగ్ కోచ్ ఉదయ్‌కుమార్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృపాల్, రవి, వెంకట్రాయులు, యస్దాని భాషా, ప్రసాద్, పీఈటీ చంద్రయ్య, చంద్రశేఖర్ అభినందించారు.

పలువురికి ఎమ్మెల్యే పాశిం పరామర్శ

వాకాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ బుధవారం పర్యటించారు. ఇటీవల టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి తల్లి కృష్ణమ్మ మృతి చెందడంతో ఆమెకు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వలగనూరు గ్రామంలో ఇటీవల టీడీపీ నేత మోహన్‌రెడ్డి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, హరిప్రసాద్, నెలవల సమక్షంలో ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు సంక్షేమమే ధ్యేయంగా నాయుడుపేట మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేస్తుందని ఏఎంసీ చైర్మన్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ అన్నారు. నాయుడుపేట ఏఎంసీ ప్రాంగణంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ కె. సాయి సమక్షంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్‌గా ఉయ్యాల ప్రవీణ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పార్థ సారధి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, అట్ల కృష్ణారావు, గూడూరు ప్రభావతి, బొమ్మన శ్రీధర్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, దుద్దుశెట్టి సుజయ్‌బాబు, కిలారి గోపీ, గిండి సతీష్, కేశవరెడ్డి, సుజాత, మైలారి రాజశేఖర్, గంగాప్రసాద్, విజయకుమార్‌నాయుడు, జీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎవరికి ఇబ్బంది లేకుండా అందరి ఆమోదంతో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో రైల్వే అధికారులు కచ్చేరి వీధిలోని రైల్వేగేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఎవరికి ఎటువంటి అభ్యంతరం లేదని స్థానికులు చెప్పారు. సీనియర్ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బాలమురగన్ మాట్లాడుతూ అండర్ బ్రిడ్జినిర్మాణం వల్ల ఎవరికీ ఇబ్బందులు ఉండవన్నారు.

విశాఖ పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలి


ఆలయం వద్ద పూజల్లో టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులు పోటెత్తాలని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. బుధవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఏడుగంగల ఆలయంలో పూజలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు విశాఖలో సీఐఐ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో 37ప్లీనరీ సెషన్లు, కంట్రీసెషన్ల నిర్వహణ 410 ఒప్పందాల ద్వారా ఏపీకి రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు రావాలని పూజలు చేశారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు డీవీ నారాయణ, కోట చంద్రశేఖర్, మురళీనాయుడు, సులేమాన్, చంద్రబాబు, కృష్ణమూర్తి, రాజేష్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి


రికార్డులను పరిశీలిస్తున్న కాంతారావు

నారాయణవనం, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు పేర్కొన్నారు. బుధవారం నారాయణవనం మండలంలోని కొండలచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌ను, బాలింతలకు, విద్యార్థులకు అందించే గుడ్లను పరిశీలించారు. ఎంపీపీఎస్ పాఠశాలలో గుడ్డు బరువులో వ్యత్యాసం ఉందని, సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు, డీఎం బాలకృష్ణ, జిల్లా విద్యాశాఖాధికారి రమణారావు, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాలో 38మంది ఎంపిక



శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఉద్యోగమేళా జరిగింది. ఈ మేళాలో పలు బహుళ జాతీయ సంస్థలు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 56మంది విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కాగా వారిలో 42మందితో షార్ట్‌లిస్టు తయారు చేశారు. అందులో 38మందిని ఎంపిక చేశారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజనాయుడు నియామకపత్రాలను అందజేశారు. వీరికి నెలకు రూ.15వేలతో పాటు ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. ఎంపికైన వారిని అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరసింహవర్మ, అధ్యాపకులు గంగారామ్, గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు


శ్రీకాళహస్తి నుంచి వచ్చిన గల్పర్లు

కేవీబీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరులో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. శ్రీకాళహస్తి నాలుగు గల్పర్లు కళత్తూరుకు చేరుకుని ప్రతి ఇంటి మరుగుదొడ్డి ట్యాంకులను శుభ్రం చేయించి వెనువెంటనే బ్లీచింగ్, ఫినాయిల్ చాల్లారు. వీధులు చాలా వరకు మెరుగపడ్డాయి. వైద్యసేవలు కొనసాగుతు న్నాయి. రోగాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు గోవింద స్వామి, పవన్‌సుందర్‌కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా జనసేన నాయకుడు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ హరిప్రసాద్ బాధితులను పరామర్శించారు.

లేబర్ కోడ్లను రద్దు చేయండి: ఏఐటీయూసీ

వరదయ్యపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో శ్రామికవర్గం తీవ్రంగా నష్టపోతోందన్నారు. 44 కార్మిక చట్టాలను నిర్వీర్యంచేసి నాలుగు లేబర్‌కోడ్లను తీసుకురావడం సరికాదన్నారు. రాష్ట్రప్రభుత్వం 12గంటల పని విధానాన్ని తీసుకురావడం చూస్తుంటే పెట్టుబడిదారుల కోసం పని చేస్తోందనడానికి నిదర్శనమన్నారు. కోటేశ్వరరావు, చిన్నిరాజ్, అన్నాదొరై తదితరులు పాల్గొన్నారు.

23న మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

ఏర్పేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 23న వ్యాసాశ్రమ వ్యవస్థాపకుడు, సద్గురు మలయాళస్వామి విగ్రహాన్ని ఆశ్రమ పూర్వవిద్యార్థులు ప్రతిష్ఠించనున్నారు. ఉదయం 10గంటల్లోపు గణపతిపూజ, వాస్తుపూజ, కలశస్థాపన నిర్వహిస్తారు. అనంతరం విగ్రహప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు.

పోలీసుల చొరవతో కేటీ రోడ్డుకు మరమ్మతులు


పదవమైలు దగ్గర కేటీ రోడ్డులో పెద్ద గుంతలను పూడ్చుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు పదవమైలు సమీపంలో పెద్ద గుంతలకు ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం మరమ్మతులు చేపట్టారు. మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పదవమైలు దగ్గర మూడు ప్రాంతాల్లో పెద్ద గుంతలు పడటంతో వాహన రాకపోకలకు అంతరాయం కలగడమే కాగ రాత్రి వేళ్లలో ప్రమదాలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని క్వారీ డస్ట్‌తో గుంతలను పూడ్పించారు. పోలీసులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.




బీఎన్‌కండ్రిగ దాబా సమీపంలో ఏర్పడిన గుంతలు - అరిగిలకండ్రిగ సమీపంలో ఉన్న గుంతలు - కాటూరు బ్రిడ్జి మధ్యలో ఏర్పడిన గుంత

మరి వీటి సంగతేంటి సారూ...

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు శ్రీకాళహస్తి - తడ రోడ్డు గుంతలమయమై ప్రయాణం దుర్భరంగా మారింది. కేటీ రోడ్డులోని పదవమైలు, విజయగోపాలపురం, అరిగిలకండ్రిగ, పద్మావతిపురం, బీఎస్‌కండ్రిగ, ఆలత్తూరు క్రాస్, కారణిమిట్ట తదితర గ్రామాల సమీపంలో రోడ్లు గుంతలమయమయ్యాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డులో గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నట్టు యజమానులు వాపోతున్నారు. పదవమైలు దగ్గర రోడ్డు కోతకు గురై ప్రమాదాలకు నెలవుగా మారింది. బీఎన్‌కండ్రిగ దాబా దగ్గర రోడ్డు కుంగింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కేటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

డ్రమ్‌సీడర్‌పై రైతులకు అవగాహన

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డ్రమ్ సీడర్‌తో వరి నాటే విధానంపై రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. రాస్ హెడ్ శ్రీనివాసులు మాట్లాడుతూ... సీడర్ విధానం ద్వారా తక్కువ నీరు, విత్తనం, ఖర్చుతో సాగు చేయవచ్చని తెలిపారు. ఎకరానికి సుమారు రూ.7 వేలు ఆదా చేయవచ్చని తెలిపారు. డ్రమ్ సీడర్‌తో ఒక్కరోజులో 4నుంచి ఐదెకరాల్లో నాట్లు వేసుకోవచ్చన్నారు. రాస్ శాస్త్రవేత్తలు దివ్య, సురేష్ పాల్గొన్నారు.

మృతదేహాల అప్పగింత

రేణిగుంట నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చైతన్యపురం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చంద్ర భానుసింగ్, సరస్వతి బాయి మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బుధవారం మృతుల బంధువులకు అప్పగించారు. అలాగే తీవ్రగాయాలు పాలైన దివ్య రూయా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మెరుగైన వైద్యం కోసం బంధువులు కర్నూలు నగరానికి తరలించారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన గుడి కృష్ణమోహన్ నాయుడు రూ.25వేలు విరాళంగా అందజేశారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం: ఎమ్మెల్యే సుధీర్


ప్రమాణం చేయిస్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ విజయం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షులు, క్లస్టర్లు, యూనిట్లు, బూత్ లెవల్ ఏజెంట్ల ప్రమాణస్వీకారం జరిగింది. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం శ్రీకాళహస్తి మండలం, ఏర్పేడు, రేణిగుంట, పట్టణ మండలాల పార్టీ అధ్యక్షులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి కార్యకర్తకు న్యాయం చేయడమే కాకుండా అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల పార్టీ అధ్యక్షులు రావిళ్ల ముని రాజానాయుడు,ధనంజయులునాయుడు, నాయకులు చెంచయ్యనాయుడు, కాసరం రమేష్, హరి, ఆర్ముగం, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు



శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల బస్సులను ఆయన తనిఖీ చేశారు. బస్సుల్లో భద్రతాపరమైన చర్యలు తీసుకున్నారా లేదా అని పరిశీలించారు. ఈ తనిఖీల్లో విద్యార్థులను పరిమితికి మించి తీసుకెళ్తున్న రెండు బస్సులపై కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో హెల్పర్‌కు తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న ఇబ్రాయిల్

కేవీబీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సబ్‌స్టేషన్‌లో హెల్పర్‌గా పనిచేస్తున్న కాట్రపల్లికి చెందిన ఇబ్రాయిల్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయడానికి పైకి ఎక్కి విద్యుదాఘాతంతో గాయపడ్డారు. మంగళవారం రాత్రి ఇబ్రాయిల్‌కు నైట్ డ్యూటీ. బుధవారం ఉదయం కేవీబీపురానికి చెందిన ఏలుమలై సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు కాలిపోయిందని చెప్పగా డ్యూటీలో ఉన్న చంద్ర అనే ఉద్యోగి ఇబ్రాయిల్‌ను పంపించాడు. ఇంతలో మరో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని నరేష్.. ఇబ్రాయిల్‌ను వెంటబెట్టుకుని వెళ్లాడు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాలంటే ఎల్‌సీ ఇవ్వాల్సి ఉంటుంది. చంద్ర ఎల్సీ ఇచ్చానని చెప్పడంతో ఇబ్రాయిల్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కగా షాక్ కొట్టి కిందపడి గాయపడ్డాడు. అక్కడే ఉన్న పలువురు పారిపోగా కాట్రపల్లికి చెందిన కొందరు గుర్తించి ఇబ్రాయిల్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వచ్చి ప్రైవేటు వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యం: ఎమ్మెల్యే ఆదిమూలం


పోస్టర్ల ఆవిష్కరణలో ఎమ్మెల్యే తదితరులు

పిచ్చాటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, నివాస యోగ్యం కోసం ప్రతి ఒక్కరికీ ఇల్లు అందించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఎంపీడీవో రఫితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం స్థానికంగా గృహ కల్ప పథక లబ్ధిదారుల గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. 15న శనివారం ఎంకేటీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాతో 15 బహుళ జాతీయ కంపెనీల ఆధ్వర్యంలో 750 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్వ్యూలకు వచ్చే వారికి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్, వాసురెడ్డి, సుమాంజలి పాల్గొన్నారు.

వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి



శ్రీకాళహస్తిలో జరిగిన ర్యాలీ

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వైసీసీ శ్రేణులతో నిరసన ర్యాలీ చేపట్టి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. పీపీపీ విధానంతో పేద విద్యార్థుల వైద్య విద్యకు గండి పడుతోందన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నాయకులు అంజూరు శ్రీనివాసులు, వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ సత్యవేడు పట్టణంలో నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. సుశీల్‌కుమార్ రెడ్డి, ఏఎంఎం బాలాజీ రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచండి

వరదయ్యపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సులభతర విద్యాబోధన, అభ్యాసన సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచాలని సమగ్రశిక్ష పథకం జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్ తెలిపారు. వరదయ్యపాళెం ఎమ్మార్సీ లో బుధవారం ఎంఈవోలు,సీఆర్పీల సమావేశంలో నాడు-నేడు, అసంపూర్తి గదులు, పీఎంశ్రీ, పాల్‌ల్యాబ్ పురోగతిపై ఆరా తీశారు. వరదయ్యపాళెం, బత్తలవల్లం, చిలమత్తూరు, మత్తేరిమిట్ట ఉన్నతపాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు.

ఉనికి కోసమే వైసీపీ ఉద్యమం

టీఎన్ఎస్ఎఫ్

సత్యవేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉనికి కోల్పోతున్న వైసీపీ ఉద్యమాల పేరిట నాటకాలు ఆడుతోందని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో... మాట్లాడుతూ విద్యార్థులను, యువతను రెచ్చగొట్టడానికే కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తోందంటూ ర్యాలీలు నిర్వహిస్తోందన్నారు. పీపీపీ విధానం వల్ల పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఎటువంటి నష్టం జరగదన్నారు. కళాశాలలో కన్వీనర్ కోటా కింద 50 శాతం విద్యార్థులకు సీట్లు వస్తాయని తెలియజేశారు. పేదలకు ఎటువంటి ఓపీ రుసుం లేకుండా వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు.

స్వామిత్వ ద్వారా ఖాళీ స్థలాల సర్వే

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గ్రామం కంఠం స్థలాలను గుర్తించి వాటిలో పట్టాలు ఇస్తామని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలోని పెద్దపాలేడు పంచాయతీలో స్వామిత్వపై బుధవారం ఎంపీడీవో అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలో ఇల్లు, ఖాళీ స్థలాలను ఇప్పటికే కార్యదర్శులు, సర్వేయర్లతో సర్వే చేసి నమోదు చేశామన్నారు. వీటి వివరాలను 9(2) నోటీసుల రూపంలో తెలిస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. కార్యదర్శి లోకమూర్తి, వీఆర్‌ఓ, సర్వేయర్, ప్రజలు పాల్గొన్నారు.

గుడిమల్లం రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

ఏర్పేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశంలో మొదటి శివాలయంగా గుర్తింపు పొందిన త్రిమూర్తుల ఆలయం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి పాపా నాయుడుపేట నుంచి స్వర్ణముఖి నది ఆనుకుని వెళుతున్న బైపాస్‌రోడ్డు అభివృద్ధికి కలెక్టర్ వెంకటేశ్వర్ చొరవతో సోమవారం రూ.2.32 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. మంగళవారం సాయంత్రం ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే సుధీర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

టీటీడీ నిధులతో అంబేడ్కర్ భవనాన్ని పునర్నిర్మించండి

ఏర్పేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బుధవారం అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివన్, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్‌కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని అంబేడ్కర్ భవన్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుందని దాన్ని టీటీడీ నిధులతో పునర్నిర్మించాలని కోరారు. అందుకు ఈవో సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

సీఎం సహాయనిధి అందజేత

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గుండె శస్త్రచికిత్స చేయించుకున్న బాధితుడికి ఎమ్మెల్యే సుధీర్ బుధవారం సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన మునిప్రసాద్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. సీఎంసహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం ఎమ్మెల్యే స్వగృహంలో బాధితుడికి రూ.1,80,630 చెక్కును అందజేశారు.

వసతిగృహంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో ఆర్వోప్లాంట్‌ను బుధవారం ఎమ్మెల్యే సుధీర్ ప్రారంభించారు. ఈసందర్భంగా చిన్నారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని ఆరా తీశారు. వసతిగృహంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలు


కొత్త ఇంటి వద్ద ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమం వద్ద ప్రభుత్వం మంజూరుచేసిన పక్కా ఇళ్లలో లబ్ధిదారులు బుధవారం గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరో హామీ అమలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఒకేసారి గృహ ప్రవేశాలను నిర్వహించిందన్నారు. శ్రీకాళహస్తి పరిధిలో 3,342 ఇళ్లకు బుధవారం గృహప్రవేశం జరిగిందన్నారు. 17నెలల్లో పేదల సొంతింటి కల నెరవేరిందన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి కళత్తూరు ముంపు వివరాలు


విమానాశ్రయంలో కేంద్రమంత్రిని కలిసిన కళత్తూరువాసులు

కేవీబీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తిరుపతికి మంగళవారంవిచ్చేశారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయంలో కళత్తూరు వాసులు కేంద్రమంత్రి దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపినాథ రెడ్డి, నాయకులు రామచంద్రయ్య, గోవర్ధన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.